ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
మంగళవారం 23 జూలై 2024


సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఎగసి పడుతున్న మంటలు

సబ్ కలెక్టరేట్‌లో మిస్టరీ మంటలు..!

- కాలిపోయిన కార్యాలయంలోని ఫైళ్లు
- పెద్దిరెడ్డి కుటుంబం హస్తంపై అనుమానం
- డీజీపీ, సీఐడీ చీఫ్, ట్రాన్స్‌కో సీఎండీ విచారణ
- ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఉద్రిక్తత

మదనపల్లె, జూలై 22: మదనపల్లెలో మిస్టరీ మంటలు కలకలం సృష్టించాయి. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం రాత్రి జరిగిన ఈ సంఘటనలో రెవెన్యూకు సంబంధించిన కీలకమైన ఫైళ్లు దగ్ధమయ్యాయి. సోమవారం ఉదయం విషయం తెలుసుకున్న టీడీపీ నేతలు, సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, బీజేపీ, ఇతర ప్రజాసంఘాలు స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళనకు దిగాయి. ఇదంతా మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పనే అంటూ ఆరోపించారు. అయిదేళ్ల వైసీపీ కాలంలో మదనపల్లె, తంబళ్లపల్లె, పుంగనూరు ఏరియాలలో పెద్దిరెడ్డి కుటుంబం వివిధ మార్గాల్లో ఆక్రమించిన భూమిగా పేర్కొన్నారు. పేదల నుంచి వీరు దౌర్జన్యంగా ఆక్రమించిన, ప్రభుత్వ ప్రైవేటు భూములు వేల ఎకరాలు కబ్జా చేశారని, వీటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పేదలకు తిరిగి ఇచ్చేస్తుందని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ భూములకు సంబంధించిన కీలక ఫైళ్లను లేకుండా చేయడంలో భాగంగానే గుర్తుతెలియని దుండగులు ఫైళ్లకు నిప్పు పెట్టారని ధ్వజమెత్తారు. దీని వెనుక పెద్దిరెడ్డి కుటుంబం హస్తం ఉందని టీడీపీ, సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, బీజేపీ, ప్రజాసంఘాలు మండిపడ్డాయి. దీనిని తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం, సీఎం చంద్రబాబు నాయుడు..వెంటనే మదనపల్లెకు వెళ్లి విచారణ చేపట్టాలని ఆదేశించడంతో డీజీపీ ద్వారకా తిరుమల రావు, సీఐడీ చీఫ్ రవిశంకర్‌అయ్యన్నార్, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, కలెక్టర్ సి.హెచ్.శ్రీధర్‌లు ఉదయం సంఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. వీరిలో కలెక్టర్, ఎస్పీలు ఉదయాన్నే సబ్‌కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఇందులో భాగంగా ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఉద్యోగులను మినహా లోనికి ఎవరినీ అనుమతించలేదు. సంఘటన జరిగిన ఈ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్న పోలీసులు క్లూస్‌టీంతో వివరాలు సేకరించారు. అనంతరం మధ్యాహ్నం 3:30 గంటలకు విజయవాడ నుంచి విమానంలో రేణిగుంటకు చేరుకుని అక్కడి నుంచి హెలికాప్టర్‌లో మదనపల్లెకు చేరుకున్నారు. ఇక్కడికి చేరుకున్న డీజీపీ, సీఐడీ చీఫ్‌లు సాయంత్రం 6:30 గంటల వరకూ సబ్‌కలెక్టర్ కార్యాలయంలో విచారణ చేపట్టారు. సంఘటన జరిగిన ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించి సంఘటనపై ఆరా తీశారు. అంతకుముందు ట్రాన్స్‌కో సీఎండీ సంతోష్‌రావు, ఎస్ఈ సురేంద్రనాయుడు, ఈఈలు రాజశేఖర్‌రెడ్డి, యుగంధర్, రవి కుమార్, సంతోష్, తదితరులు విచారణ చేపట్టారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగిందని ఆర్డీవో హరిప్రసాద్, కార్యాలయ ఉద్యోగులు చెబుతున్నారు. ఈ క్రమంలో విద్యుత్తుశాఖ అధికారులు రంగప్రవేశం చేశారు. ఇది అగ్ని ప్రమాదం కాదని, ఉద్దేశపూర్వకంగానే నిప్పు పెట్టి కీలకమైన ఫైళ్లు కాల్చేశారని, అటు స్థానికులతో పాటు రాజకీయ పార్టీల నాయకులు తేల్చిచెప్పారు. ఈ క్రమంలో ట్రాన్స్‌కో సీఎండీ ఆధ్వర్యంలోని ఎస్ఈ, ఈఈల బృందం సంఘటన జరిగిన ప్రాంతాన్ని పరిశీలించింది. సంఘటన జరిగిన ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన ఈ బృందం విద్యుత్తు ప్రమాదంతో సంఘటన జరగలేదని తేల్చారు. ఇది విద్యుత్తు ప్రమాదం కాదని, మరేదైనా ఉండొచ్చని స్పష్టం చేశారు.

స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం రాత్రి అగ్నిప్రమాద సంఘటనలో ఆర్డీవో చాంబర్, ఏవో చాంబర్‌లు మినహా అన్ని విభాగాలు అగ్నికి ఆహుతయ్యాయి. ఇందులో ముఖ్యంగా 22ఏ, ల్యాండ్ కన్వర్షన్, చుక్కల భూములు, ఆర్‌వోఆర్ అప్పీలు, ఎన్‌వోసీ, తదితర కీలకఫైళ్లు కాలిపోయాయి. ఈ విభాగాన్ని చూసే సీనియర్ అసిస్టెంట్ గౌతమ్‌తేజ్ ఆదివారం రాత్రి 11:45 గంటల వరకూ కార్యాలయంలో ఉన్నట్లు చెబుతున్నారు. నిమ్మనపల్లె మండలం అగ్రహారం వీఆర్వో రమణయ్య రాత్రి విధుల్లో ఉన్నారు. రాత్రి అక్కడే పడుకున్న వీఆర్ఏ అక్కడ మంటలు రావడాన్ని చూసి మొదటగా నిమ్మనపల్లె డిప్యూటీ తహసీల్దార్‌కు సమాచారం ఇచ్చాడు. దీంతో అప్రమత్తమైన ఆమె సబ్‌కలెక్టర్ కార్యాలయం సిబ్బంది, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చినట్లు చెబుతున్నారు. పక్కనే ఉన్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని గంటన్నరకుపైగా శ్రమించిన తర్వాత మంటలను అదుపులోకి తెచ్చినట్లు చెబుతున్నారు. అంతకుముందే అక్కడికి చేరుకున్న ఆర్డీవో హరిప్రసాద్ పరిస్థితిపై ఆరా తీశారు.

సోమవారం ఈ విషయం దావణంలా వ్యాపించడంతో రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, ప్రజలు అక్కడికి చేరుకుని సంఘటనపై ఆరా తీశారు. డీజీపీ, సీఐడీ చీఫ్, ట్రాన్స్‌కో సీఎండీతో పాటు పోలీసులు పెద్దఎత్తున అక్కడికి చేరుకోవడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఉద్రిక్తతతో పాటు హైడ్రామా నడిచింది. విచారణ అనంతరం సాయంత్రం 6:30 గంటల ప్రాంతంలో డీజీపీ అక్కడికి చేరుకుని సంఘటనపై క్లారిటీ ఇచ్చారు. ఇది యాక్సిడెంట్ కాదు.. ఇన్సిడెంట్ అని వెల్లడించారు.

ఆలస్యంగా సమాచారం చేరవేత

సంఘటన 11:30 గంటల సమయంలో జరిగితే పక్కనే ఉన్న అగ్నిమాపక అధికారులు నిమిషాల వ్యవధిలో అక్కడికి చేరుకునే వారు. దీంతో ప్రమాద తీవ్రత కూడా తగ్గేది. అలాగే విద్యుత్తు సబ్‌స్టేషన్ కూడా అతి సమీపంలో వుంది. అలాగే ఆర్డీవో నివాసం ఉన్న బంగ్లా కూడా పక్కనే ఉంది. విద్యుత్తు ప్రమాదం అయివుంటే మొదటగా పొగలు వచ్చి, క్రమంగా మంటలు వ్యాపించేవి. కానీ అక్కడ జరిగిన సంఘటన చూస్తే, ఒకేసారిగా పెద్దఎత్తున మంటలు వ్యాపించడం చూస్తే..ఫైళ్లపై ఏదైనా రసాయనం, డీసెల్, పెట్రోల్ పోసి నిప్పు అంటించినట్లు స్పష్టమవుతోంది. దీనిని ఫోరెన్సిక్ నిపుణులు తేల్చే పనిలో ఉన్నారు. కార్యాలయంలో ఆర్డీవో, ఏవో చాంబర్ మినహా అన్నీ విభాగాల్లోని కీలకఫైళ్లు కాలిపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పైగా ఇక్కడి నుంచి కొన్నిఫైళ్లను బయటకు తీసుకెళ్లి, కాల్చివేసినట్లు కూడా అక్కడ ఆనవాళ్లు ఉన్నాయి. వారు చెబుతున్నట్లు కార్యాలయం పాతదేమీ కాదు..నాలుగేళ్ల క్రితం రెన్యువేషన్ చేశారు. అలాగే కార్యాలయంలో విభాగాల వారీగా పార్టీషన్‌తో పాటు కొత్త వైరింగ్ చేశారు. దీంతో విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ జరిగే అవకాశమే లేదు. ఒకవేళ జరిగినా విద్యుత్తు వ్యవస్థను కంట్రోల్ చేస్తున్న పీసీబీలు ఆఫ్ అవుతాయి. అంతకుమించి ఆ సమయంలో ఒక యాంపు విద్యుత్తు మాత్రమే సరఫరా అవుతున్నట్లు విద్యుత్తుశాఖ నిపుణులు తేల్చారు.


కార్యాలయంలో పూర్తిగా కాలిపోయిన ఫైళ్లు


సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద పోలీసు అధికారులు


సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట గుమికూడిన ప్రజలు

దోషులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలి

- డీజీపీకి విన్నవించిన టీడీపీ నేతలు

మదనపల్లె టౌన్, జూలై 22: మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో జరిగిన అగ్నిప్రమాదం ఉద్దేశ్యపూర్వకంగా జరిగినట్లు తెలుస్తోందని ఈ సంఘటన వెనుక ఉన్న దోషులను ఎంతటి వారైనా అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావుకు వినతిపత్రం అందజేశారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టరేట్ వద్ద జగన్‌మోహన్‌రాజు మాట్లాడుతూ మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన సోదరుడు తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి, ఎంపీ మిధున్‌రెడ్డి జిల్లాలో వేలాది ఎకరాలు బినామీ పేర్లతో కాజేశారని ఆరోపించారు. ల్యాండ్ టైటిల్ యాక్టు అడ్డుపెట్టుకుని 22ఏలో ఉన్న భూములను వారి బినామీ పేర్లతో మార్చుకున్నట్లు తెలిసిందన్నారు. ఇప్పుడు ఈ అక్రమాలు బయటకు వస్తాయనే సబ్ కలెక్టరేట్‌లో అగ్నిప్రమాదం సృష్టించి రికార్డులు అన్నీ దహనం చేశారని ఆరోపించారు. తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు మాట్లాడుతూ జరిగిన సంఘటనపై డీజీపీ, సీఐడీ చీఫ్ లోతుగా దర్యాప్తు చేస్తే అసలు దోషులు బయటపడతారని, వారు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని డీజీపీకి విన్నవించారు. కార్యక్రమంలో తంబళ్లపల్లె టీడీపీ నాయకుడు దాసరిపల్లె జయచంద్రారెడ్డి, సీడ్ మల్లికార్జుననాయుడు, మార్పూరి సుధాకర్‌నాయుడు, దొమ్మలపాటి యశ్వీరాజ్ పాల్గొన్నారు.


డీజీపీ ద్వారకా తిరుమలరావుకు వినతిపత్రం ఇస్తున్న పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు, టీడీపీ నేతలు

అన్ని వేళ్లూ ఆవైపే

- అదుపులోకి గౌతమ్‌తేజ్, వీఆర్ఏ..
- ఉద్యోగుల సెల్‌ఫోన్లు స్వాధీనం
- కాల్‌డేటా సేకరణలో నిమగ్నం
- పనిచేయని సీసీ కెమెరాలు
- గత ఆర్డీవో మురళి పాత్రపై అనుమానం

మదనపల్లె, జూలై 22: మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం రాత్రి జరిగిన అగ్నిమాద ఘటనపై అన్నీ అనుమానాలే వ్యక్తమవుతున్నాయి. ఆర్డీవో హరిప్రసాద్‌తో పాటు ఉద్యోగులందరూ విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌గా చెబుతున్నా ఎవరూ దానిని విశ్వసించడం లేదు. పైగా ట్రాన్స్‌కో సీఎండీ సంతోష్‌రావు కూడా ఇది విద్యుత్తు ప్రమాదం కాదని, మానవ తప్పిదమని చెబుతూ ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చారు. ఇక అందరి అనుమానమే నిజమని సంఘటన తీరును బట్టి తెలుస్తోంది. అయితే కుట్రలో భాగంగా ఉద్దేశపూర్వకంగానే ఫైళ్లు తగలపెట్టారని స్పష్టమవుతోంది. అయితే ఇంతటి సాహసానికి ఎవరు ఒడిగడతారన్నదే అంతుచిక్కని ప్రశ్న. ఒక సామాన్యుడు ఆర్డీ తీసుకెళ్లడానికే అక్కడికి వెళ్లడానికి భయపడతాడు. అలాంటిది ఏకంగా ఫైళ్లకే నిప్పు పెట్టారంటే ఇందులో ఇంటిదొంగల హస్తం ఉంటుందని భావిస్తున్నారు. ముఖ్యంగా సబ్‌కలెక్టర్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ గౌతమ్‌తేజ్‌పైనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అయిదేళ్ల వైసీపీ పాలనలో పెద్దిరెడ్డి కుటుంబం, వారి అనుచరులు మదనపల్లె, తంబళ్లపల్లె, పుంగనూరు నియోజకవర్గాల్లో వందల ఎకరాలు వివిధ రూపాల్లో ఆక్రమించారు. ఇందులో పేదలు, రైతుల నుంచి అసైన్‌మెంట్ భూములను తక్కువ ధరకు కొనగోలు చేయడం, తర్వాత కలెక్టర్ నుంచి ఎన్‌వోసీ పొందడం, తర్వాత ల్యాండ్ కన్వర్షన్ చేయడం షరా మామూలైంది. ఇందులో వీఆర్వోల నుంచి తహసీల్దార్ వరకూ కీలకపాత్ర పోషించారు. అలాగే సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవోలు తమ వంతు సహకారం అందించారు. ఈ క్రతువు అంతా ఇక్కడే నుంచే పూర్తి చేశారు. ఈ క్రమం లో ఇక్కడున్న సీనియర్ అసిస్టెంట్ గౌతమ్‌తేజ్ ఆర్డీవోలు చెప్పినట్లు తహసీల్దార్ల నుంచి తమకు కావాల్సిన విధంగా నివేదికలు తెప్పించుకుని కా ర్యం చక్కదిద్దడంలో కీలకపాత్ర పోషించినట్లు రెవెన్యూ ఉద్యోగులు చెబుతున్నారు. ఈ క్రమంలో సంఘటన జరిగిన ఆదివారం రాత్రి 11:45 గంటల వరకూ కార్యాలయంలోనే ఉన్నట్లు అక్కడ కాపాలా ఉన్న వీఆర్ఏ చెబుతున్నారు. అక్కడ వీఆర్ఏ నిద్రలోకి జారుకోగా, బయటకు వెళ్లిన అనంతరం మంటలు రావడాన్ని చూస్తే, ఈయన ప్రమేయంపై అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

అదుపులో నిందితుడు, ఉద్యోగులు

ఆది నుంచీ అనుమానం వ్యక్తం చేస్తున్న సీనియర్ అసిస్టెంట్ గౌతమ్‌తేజ్‌ను, వీఆర్ఏ రమణయ్యను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. అలాగే ఉద్యోగులందరినీ విచారించి సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఈనెల 10వ తేదీ వరకు పనిచేసిన కెమెరాలు ఆ తర్వాత పనిచేయకపోవడం చూస్తే కుట్రకోణం ఉన్నట్లే చెప్పాలి. వైసీపీ అధికారంలో ఉన్నన్నాళ్లూ పెద్దిరెడ్డి కుటుంబానికి అప్పటి ఆర్డీవో ఎం.ఎస్.మురళి అంటకాగినట్లు ప్రధానమైన ఆరోపణలు ఉన్నాయి. ఈ సంఘటన నేపథ్యంలో డీజీపీ ద్వారకా తిరుమలరావు ఆర్డీవో మురళిని విచారించినట్లు తెలిసింది. ఇందులో భాగంగా వన్‌బీలు చేయడం, ఎన్‌వోసీలకు రెకమెండ్ చేయడంతో పాటు భూమార్పిడి ఫైళ్లు పెద్ద ఎత్తున చేశారు. ఈ క్రమంలో స్థానికంగా ఉన్న పెద్దిరెడ్డి అనుయాయుడు వి.మాధవరెడ్డి, పెద్దిరెడ్డి పీఏలు నిత్యం సబ్‌కలెక్టర్ కార్యాలయాన్ని అడ్డగా చేసుకుని ఉండేవారు. బీ.కె.పల్లె, వలసపల్లె రెవెన్యూ గ్రామాల్లో పెద్దిరెడ్డి కుటుంబంపై ఏడు ల్యాండ్ కన్వర్షన్ ఫైళ్లకు ఇటీవల దరఖాస్తు చేశారు.

ఇందులో భాగంగా శనివారం ఆ ఫైళ్లను క్లియర్ చేసే క్రమంలో ఆర్డీవో హరిప్రసాద్, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించారు. ఇదిలావుండగా, గతంలో ఇక్కడ పనిచేసి ఆర్డీవో మురళి ఆదివారం సబ్‌కలెక్టర్ కార్యాలయానికి రావడం కూడా పలు అనుమానాలకు తావిస్తోంది. ఇక్కడున్న ఆర్డీవో హరిప్రసాద్ అనంతపురానికి బదిలీ కావడం, ప్రభుత్వం ఇక్కడికి సబ్‌కలెక్టర్‌ను నియమించడం, ఆయన సోమవారం విధుల్లో చేరాల్సి ఉండగా, ఈ ఘటన జరగడం అన్నీ వెనువెంటనే జరిగిపోయాయి. దీనిని బట్టి చూస్తే అన్ని వేళ్లూ వారివైపే చూపించినట్లు ఫైళ్ల కాల్చివేత కుట్ర వెనుక పెద్దల హస్తం ఉన్నట్లు చెప్పకనే చెబుతున్నాయి. దీంతో అనుమానితులపై ఆరా తీస్తున్నారు. వీరి కాల్ డేటా ఆధారంగా విచారణలో ముందుకెళ్లాలని పోలీసులు భావిస్తున్నట్లు తెలిసింది. ఇందులో భాగంగా ఇప్పటికే కొందరి ఉద్యోగులు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

తహసీల్దార్లను రిలీవ్ చేయొద్దు

- డీఆర్వోకు కలెక్టర్ ఆదేశం
- ఫైళ్ల విచారణకు టీంల ఏర్పాటు

మదనపల్లె, జూలై 22: మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆదివా రం రాత్రి జరిగిన అగ్ని ప్రమాద ఘటన నేపథ్యంలో కలెక్టర్ శ్రీధర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఎన్నికల విధులకు వచ్చిన తహసీల్దార్లను ఆయా జిల్లాలకు బదిలీ చేస్తూ సీసీఎల్ఏ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో జిల్లా వ్యాప్తంగా ఆయా మండలాల్లో కొందరు తహసీల్దార్లు శనివారమే రిలీవ్ కాగా మరికొందరు సోమవారం స్వస్థలాలకు వెళ్లడానికి సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో సబ్‌కలెక్టర్ కార్యాలయంలో జరిగిన అగ్నిప్రమాదంలో కీలకమైన రెవెన్యూ ఫైళ్లు కాలి బూడిదయ్యాయి. ఈ విషయం సోమవారం ఉదయం వెలుగులోకి రావడంతో కలెక్టర్ స్పందించారు. ఈ క్రమంలో మదనపల్లె డివిజన్‌లోని తహసీల్దార్లు ఎవరూ బదిలీ అయిన జిల్లాలకు వెళ్లొద్దని సోమవారం ఉదయం 11 గంటలకు ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే వీరిని ఎవరినీ కూడా రిలీవ్ చేయొద్దంటూ జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) సత్యనారాయణరావును ఆదేశించారు. డివిజన్ పరిధిలోని అన్ని ఫైళ్లు అగ్నికి ఆహుతి కావడంతో వాటిని తిరిగి తెప్పించే క్రమంలో కలెక్టర్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నారు. అలాగే మదనపల్లె డివిజన్‌లోని వివిధ మండలాల తహసీల్దార్ కార్యాలయాల నుంచి ఆర్డీవో కార్యాలయానికి వచ్చిన అన్ని విభాగాల ఫైళ్లను వెరిఫికేషన్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

ఇందులో భాగంగా 2022 ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకూ వచ్చిన ఫైళ్లను సిద్ధం చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టరేట్‌కు వెళ్లిన ఫైళ్లను కూడా ఇదే తరహాలో పరిశీలించాలని సూచించారు. ఈ బాధ్యతను రాయచోటి ఆర్డీవో యూ.రంగస్వామి, రాజంపేట ఆర్డీవో పి. మోహన్‌రావు, మదనపల్లె ఎస్‌డీసీ ఎస్.రాఘవేంద్ర, పీలేరు ఎస్‌డీసీ ఎస్.రామ(యూనిట్-2), రాజంపేట స్పెషల్ డిప్యూ టీ కలెక్టర్ ఎస్ఎస్‌పీ యూనిట్-4ను కలెక్టర్ ఆదేశించారు. ఈ బృందాలను పర్యవేక్షణ బాధ్యతను డీఆర్వోకు అప్పగించారు. ఇందులో ఫైళ్ల వెరిఫికేషన్‌కు రెండు మూడు మండలాలకు, ఇద్దరు ముగ్గురు తహసీల్దార్లను కేటాయించారు.

ఆరు తహసీల్దార్ల కార్యాలయాల్లో తనిఖీలు

- ఆర్డీవో స్థాయి అధికారుల పర్యవేక్షణలో రికార్డుల పరిశీలన

ములకలచెరువు, జూలై 22: మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన అగ్ని ప్రమాదంలో రికార్డులు దగ్ధం కావడంతో రెవెన్యూ అధికారులు అప్రమత్తమయ్యారు. మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయం పరిధిలోకి వచ్చే తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ములకలచెరువు, తంబళ్లపల్లె, పెద్దమండ్యం, పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట, కురబలకోట మండలలాల తహసీల్దార్ల కార్యాలయాల్లో రికార్డుల పరిశీలన కార్యక్రమం చేపట్టారు. కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదేశాలతో సోమవారం రాత్రి రాయచోటి ఆర్డీవో రంగస్వామి, రాయచోటి తహసీల్దార్లు నయాజ్‌అహమ్మద్, జయన్నలు ములకలచెరువు, కురబలకోట, తంబళ్లపల్లె మండలాల తహసీల్దార్ కార్యాలయాల్లో, పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట మండలాల తహసీల్దార్ కార్యాలయాల్లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లీలారాణి, వీరబల్లి, చిన్నమండ్యం తహసీల్దార్లు శ్రీనివాసులు, అనంద్‌కుమార్, పెద్దమండ్యం తహసీల్దార్ కార్యాలయంలో, పీలేరు హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్‌డీసీ రామ, రామాపురం తహసీల్దార్ శ్రీనివాసులు తనిఖీలు చేపట్టారు. ఆరు మండలాల తహసీల్దార్ కార్యాలయాల నుంచి భూములకు సంబంధించి మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయానికి పంపిన పత్రాలు, చుక్కల భూములు వివరాలు, 22(ఎ) భూముల రికార్డులు, వ్యవసాయ భూమి నుంచి కన్వర్షన్‌కు దరఖాస్తు చేసుకున్న తదితర ఓసీ పత్రాలను పరిశీలించారు. ఇక్కడి నుంచి పంపిన అన్ని రకాల రికార్డులు తనిఖీ చేశారు. విచారణ నివేదికలను కలెక్టర్‌కు అందజేస్తామని అధికారులు తెలిపారు. మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో రికార్డులు దగ్ధం కావడంతో ఇక్కడి నుంచి పంపిన రికార్డుల లెక్కలు తేలుస్తున్నారు.


ములకలచెరువు తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న దృశ్యం

వైభవంగా సౌమ్యనాథుడికి చక్రస్నానం

నందలూరు, జూలై 22: నందలూరు సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీదేవి భూదేవి సమేత సౌమ్యనాథస్వామి ఉత్సవమూర్తులకు చక్రస్నానం కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు సునీల్‌కుమార్‌శర్మ బృందం ఆధ్వర్యంలో మంత్రోచ్చారణల నడుమ వైభవంగా నిర్వహించారు. ఉదయం శ్రీదేవి భూదేవి సమేత సౌమ్యనాథస్వామిని పల్లకిలో మాడవీధుల గుండా యువత ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ వసంతోత్సవాలు నడుమ ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. అనంతరం చక్ర తల్వారును కోనేటిలో చక్రస్నానాన్ని ఆచరించారు. చక్రస్నానం అనంతరం భక్తులు కోనేటిలో స్నానాలను ఆచరించారు. రాత్రి 7 గంటలకు ధ్వజావరోహణం, మహాపూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి, టీడీపీ నాయకులు గంటా వాసుదేవయ్య, పల్లె సుబ్రమణ్యం, చక్రాల రామసుబ్బన్న, జంగంశెట్టి సుబ్బయ్య, మోడపోతుల రాము, పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరిరోజు మంగళవారం సాయంత్రం 6 గంటలకు పుష్పయాగం నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.


కోనేటిలో చక్రస్నానం ఆచరిస్తున్న దృశ్యం

గ్రామీణ పేదలకు వరం.. ట్రిపుల్ ఐటీ

- ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో 427 మందికి ప్రవేశాలు
- ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా

వేంపల్లె, జూలై 22: గ్రామీణ ప్రాంత పేద కుటుంబాల్లో ప్రతిభ ఉన్న విద్యార్థులకు ట్రిపుల్‌ఐటీలు వరంలాంటివని, ఇక్కడ వచ్చిన అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్త తెలిపారు. మండలంలోని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో 2024-25 విద్యాసంవత్సరంలో ఆరు సంవత్సరాల సమీకృత ఇంజనీరింగ్ కోర్సులో చేరేందుకు ఎంపికైన విద్యార్థులకు సోమవారం ప్రవేశాలు కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డైరెక్టర్ మాట్లాడుతూ నాణ్యమైన చదువుతో పాటు వసతి కల్పిస్తామని.. క్రమశిక్షణతో చదువుకుని ట్రిపుల్‌ఐటీలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. కనీసం నెలకు ఒకసారి అయిన విద్యార్థులను చూసు కునేందుకు వచ్చి ఏవైన లోటుపాట్లు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని డైరెక్టర్ తల్లిదండ్రులకు తెలిపారు.

ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో చేరేందుకు మొదటిర్యాంకు సాధించిన సత్యసాయి జిల్లా తాడిమర్రి మండలం మర్రిమాకులపల్లె గ్రామానికి చెందిన ఎం.మహేష్‌బాబుకు అడ్మిషన్ ఫైల్‌ను డైరెక్టర్ గుప్త, ఏఓ రవికుమార్, డీన్ రత్నకు మారిలు అందించారు. అనంతరం అడ్మిషన్ ప్రక్రియను ప్రారంభించారు. 515 మంది విద్యార్థులకు మొదటి రోజు హాజరు కావాలని కాల్‌లెటర్లు పంపగా.. 427 మంది హాజరై ప్రవేశాలు పొందారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులకు భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో డీన్‌లు కోటేశ్వరి, ఇమ్రాన్, చంద్రారెడ్డి, రాఘవరెడ్డి, బిన్ని, పీఆర్వో తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో మొదటి అడ్మిషన్ ఫైల్‌ను మహేష్‌బాబుకు అందిస్తున్న డైరెక్టర్ కుమారస్వామి గుప్త

కోటి ఆశలతో అడుగిడిన విద్యార్థులు

ఉన్నత విద్యా అవకాశాలు పొందేందుకు.. తల్లిదండ్రులు తమపై ఉంచుకున్న కలలను సాకారం చేసుకునేందుకు ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో ప్రవేశాలు పొందిన విద్యార్థులు కోటి ఆశలతో క్యాంపస్‌లో అడుగిడారు. వీరిలో చాలా వరకు పేద కుటుంబాలకు చెందిన వారే. రైతులు, రైతుకూలీలు, చిన్నచిన్న ఉద్యోగాలు చేసుకునే వారి పిల్లలు ఉన్నారు. వీరంతా పదవ తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా ట్రిపుల్‌ఐటీలో అవకాశం దక్కింది.

నంది, గరుడ వాహనాలపై శివకేశవులు


నంది వాహనంపై ఊరేగుతున్న సిద్దేశ్వర స్వామి

రాజంపేట, జూలై 22: తొలి తెలుగు వాగ్గేయకారుడు, పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమయ్య స్వయంగా అర్చించి సేవించిన సిద్దేశ్వర, చెన్నకేశవస్వాముల వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం సిద్దేశ్వరుడు నందివాహనంపై, చెన్నకేశవులు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం చెన్నకేశవస్వామి మోహినీ అవతారంలో భక్తులకు కనువిందు చేయగా సిద్దేశ్వరస్వామి పల్లకి సేవలో అభయమిచ్చారు. సాయంత్రం అన్నమయ్య ధ్యాన మందిరం వద్ద గల ప్రధాన వేదికపై సిద్దేశ్వర స్వామికి వేదపండితులు, అర్చకులు ఊంజల్ సేవ నిర్వహించారు. అనంతరం సిద్దేశ్వరస్వామి నందివాహనంపై, చెన్నకేశవస్వామి గరుడ వాహనంపై తాళ్లపాక మాడవీధుల్లో తిరుగుతూ భక్తులకు కనువిందు చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన రాధా గాయత్రి, ఎల్లయ్య, రమణమ్మ, శ్రీదేవి, లీలావతి, యశోద, కృష్ణ బృందాలు కోలాటాలతో భక్తులను ఆకట్టుకున్నాయి. తిరుమల తిరుపతి దేవస్థానం వారు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో తాళ్లపాక సామూహిక దేవాలయాల ఇన్‌స్పెక్టర్ బాలాజీ, గురుస్వామి యాదవ్, వినోద్‌కుమార్, సర్పంచ్ గౌరీశంకర్, తిరుమల తిరుపతి దేవస్థాన హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ గోపీ బాబు, ఆర్.స్వామినాయక్, ధర్మాచార్యులు గంగనపల్లి వెంకటరమణ, గ్రామ పెద్దలు, మహిళలు అధిక సంఖ్యలో హాజరై ఉత్సవాలను తిలకించారు.

పంచలింగాల వద్ద అపరిశుభ్రంగా కోనేరు


అపరిశుభ్రంగా ఉన్న తాగునీటి కోనేరు

సిద్దవటం, జూలై 22: వంతాటిపల్లె పంచాయతీ లంకమల్ల అభయారణ్యంలో వెలసిన నిత్యపూజయ్యస్వామి దర్శనానికి భక్తులు శివనామస్మరణతో కాలినడకన స్వామి దర్శనానికి చేరుకున్నారు. కాలినడక మార్గం పంచలింగాల కోన వద్ద తాగునీటి కోనేరు ప్లాస్టిక్ కవర్లతో పాచిపట్టి అపరిశుభ్రంగా ఉండడం, భక్తులు తెచ్చుకున్న నీటితోనే దాహం తీర్చుకుని తిరిగి కాలినడకన బయలుదేరారు. ఆలయ అధికారులు కోనేటిని శుభ్రం చేయకపోవడంతో కోనేరు అపరిశుభ్రంగా దర్శనమిస్తోందని భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి సోమవారం శివపార్వతుల కటాక్షం కోసం జిల్లా నలుమూలల నుంచి భక్తులు వస్తుంటారని, మొక్కుబడులు చెల్లించుకోవడానికి వచ్చిన భక్తులకు తాగునీరు అపరిశుభ్రంగా దర్శనం ఇవ్వడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా దేవాదాయశాఖ అధికారులు తక్షణమే స్పందించి భక్తులకు స్వచ్ఛమైన తాగునీరు అందిచాలని కోరారు. ఈ విషయంపై ఆలయ సిబ్బంది చంద్రను వివరణ కోరగా కార్యనిర్మహణ అధికారి కోనేరు శుభ్రం చేయాలని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చారని, రెండు రోజుల్లో శుభ్రం చేస్తామని తెలియజేశారు.

మారని గిరిజనుల రాతలు

నేటికీ గుడిసెల్లోనే గిరిజనులు ● కోట్లు విలువైన స్థలం నుంచి తరిమేశారు



నారాయణరెడ్డిగారిపల్లె జగనన్న కాలనీ సమీప గుడిసెల్లో నివసిస్తున్న గిరిజనులు - తమ గోడును ఆవేదనగా విరిస్తున్న కాలనీ వాసులు

రాయచోటి టౌన్, జూలై 22: ప్రభుత్వాలు మారుతున్నా గిరిజనుల తలరాతలు మాత్రం మారడం లేదు. నేటికీ గిరిజనులు గుడిసెల్లోనే తలదాచుకుంటున్నారు. గిరిజనుల సంక్షేమం కోసం ఎన్నో అభివృద్ధి పథకాలు చేపడుతున్న నేతలు వారు తలదాచుకునేందుకు మాత్రం గూడును కల్పించడంలో విఫలమవుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఎన్నికల సమయంలో సంక్షేమానికి కృషి చేస్తామని హామీలు గుప్పించే నేతలు గిరిజనుల ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చాక వదిలేస్తున్నారని విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. గిరిజనులకు ఎన్నో రకాల హక్కులను కల్పించినా అవి పూర్తి స్థాయిలో వారికి అందడం లేదు. నేటికీ అటు ప్రభుత్వాలు, ఇటు అధికారుల ద్వారా అగ్రవర్ణాల ద్వారా గిరిజనులు మాత్రం వివక్షకు గురవుతూనే ఉన్నారు. పట్టణం సహా జిల్లా పరిధిలోని కలకడ, గువ్వలచెరువు, సుండుపల్లె, సంబేపల్లె, గాలివీడు తదితర ప్రాంతాల్లో నేటికీ గిరిజనుల జీవితాల్లో వెలుగులు కనిపించడం లేదు. జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణ పరిధి నారాయణరెడ్డిగారిపల్లె వద్ద గల జగనన్న కాలనీ సమీప గుడిసెల్లో నివసిస్తున్న గిరిజనులు పలురకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కోట్ల విలువైన స్థలం నుంచి తరిమేశారు

సుద్దలవాండ్లపల్లె రోడ్డులో ఇండస్ట్రియల్ ఏరియాకు సమీపంలో 50 ఏళ్లుగా తాతల కాలం నుంచి గుడిసెలు వేసుకుని పందులు మేపుతూ, బుట్టలు అల్లుకుంటూ జీవిస్తుండేవారు. ప్రస్తుతం వారుంటున్న స్థలం విలువ కోట్లాది రూపాయలు పలుకుతోంది. ఆ స్థలంపై కన్నేసిన అప్పటి వైసీపీ నేతలు వలంటీర్ల ద్వారా వారి ఆధార్‌కార్డులు సేకరించి వారికి చిల్లర పడేసి ఊరి బయటకు తరిమేశారు. సుమారు 70 కుటుంబాలకుపైగా గిరిజనులు సుద్దలవాండ్లపల్లె రోడ్డులోని బ్రహ్మంగారిగుట్టకు ఎదురుగా గుడిసెల్లో వారు నివసిస్తున్నారు. రాయచోటి పట్టణం అన్నమయ్య జిల్లా కేంద్రం కావడంతో అమాంతం భూముల ధరలకు రెక్కలు రావడంతో గుడిసెల్లో నివాసముంటున్న గిరిజనుల స్థలంపై కన్నేసిన కొందరు అప్పటి వైసీపీ ప్రస్తుత టీడీపీ నేతలు ఆ స్థలాన్ని ఖాళీ చేయించి ఎలాగైనా కాజేయాలని పథకం పన్నారు. అయితే గిరిజనులు ఖాళీ చేసేందుకు నిరాకరించడంతో నేతలు తెలివిగా ఆలోచించి అప్పటి వలంటీర్లను గిరిజనుల వద్దకు పంపించి మీరు పందులు మేపుకుంటూ, బుట్టలల్లుకుంటూ గుడిసెల్లో నివాసం ఉంటున్నారు. మీ పిల్లలకు ఏదైనా ప్రమాదం జరిగితే ప్రభుత్వం నుంచి లక్షల్లో ఇన్సూరెన్స్ వస్తుందని ఆశ చూపి గిరిజనుల ఆధార్‌కార్డులు, రేషన్‌కార్డులు సేకరించారు. వారి పేర్లతో ఊరి బయట అక్కడ కొన్ని డీకేటీ ఇంటి పట్టాలు సృష్టించి మీ పేర్లతో ఇంటి పట్టాలు వచ్చాయి. మీరు ఇక్కడ ఉండడానికి వీలు కాదు. ఖాళీ చేయాల్సిందే అంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. ఆ స్థలంపై కన్నేసిన బడా నేతలు రంగ ప్రవేశం చేసి గిరిజనులతో మాట్లాడి కోట్ల విలువైన స్థలాన్ని లక్షల్లో చిల్లర పడేసి గుడిసెలను ఖాళీ చేయించి నారాయణరెడ్డి పల్లె సమీప జగనన్న కాలనీ వద్దకు తరిమేశారు. దీంతో గిరిజనులు చేసేది లేక జగనన్న కాలనీ సమీపంలో పక్క గ్రామ రైతు వద్ద రెండున్నరెకరాల డీకేటీ భూమిని కొనుగోలు చేసి అక్కడ గుడిసెలు వేసుకుని తలదాచుకుంటున్నారు.

వెంటాడుతున్న సమస్యలు

నారాయణరెడ్డిపల్లె వద్ద గల జగనన్న కాలనీకి సమీపంలో గుడిసెలు వేసుకుని నివాసముంటున్న గిరిజనులను పక్కా గృహాలు, తాగునీరు, విద్యుత్ సమస్యలు వెంటాడుతున్నాయి. సుమారు 70 కుటుంబాలకు పైగా గుడిసెల్లో నివసిస్తున్న గిరిజనులు తాగునీరు లేక నానా అవస్థలు పడుతున్నారు. తాగునీటి కోసం జగనన్న కాలనీలోకి వెళితే నీళ్లు మాకు సరిపోవడం లేదంటూ గిరిజనులను అక్కడికి రానివ్వకుండా అడ్డుకుంటున్నారని వాపోతున్నారు. దీనికి తోడు విద్యుత్ సరఫరా లేకపోవడంతో రాత్రిళ్లు విషపురుగుల బారి నుంచి ప్రమాదాలు వెంటాడుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్, మున్సిపాలిటీ అధికారులకు చెప్పినా మా సమస్యలను పట్టించుకోకపోవడంతో నేరుగా మేమే సొంతంగా పక్క కాలనీ నుంచి సర్వీసు వైరు ద్వారా విద్యుత్ సరఫరా తెచ్చుకోవాల్సిన పరిస్థితులు వచ్చాయన్నారు. వృద్ధులు, చిన్నపిల్లలు, మహిళలు తాగునీరు లేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూలి పనులు చేసుకునే తాము పనులు మానేసి తాగునీటి కోసం పక్క కాలనీ, గ్రామాలకు వెళ్లాల్సిన పరిస్థితులు వచ్చాయని వాపోయారు. మా గోడును మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని జిల్లా ఉన్నతాధికారులు వెంటనే చొరవ చూపి మా కాలనీలో బోరు వేసి తాగునీటి సమస్య, విద్యుత్ సమస్యలను తీర్చాలని కోరుతున్నారు.

తాగునీటి కోసం తప్పని ఇబ్బందులు



రాయచోటికి సమీపంలో ఉన్న మమ్మల్ని ఊరికి దూరంగా పంపించేశారు. ప్రస్తుతం నారాయణరెడ్డిపల్లె వద్ద గల జగనన్న కాలనీ సమీపంలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్నాము. మా కాలనీలో తాగునీటి బోరు లేకపోవడంతో పక్కనున్న జగనన్న కాలనీకి వెళితే వారు రానివ్వడం లేదు. మున్సిపల్ అధికారులు ప్రత్యేక చొరవ చూపి తాగునీటి సమస్య పరిష్కారం కోసం బోరు వేసి మాకు గుక్కెడు నీరు ఇచ్చి ఆదుకోవాలి. నీటి కోసం కూలి పనులు కూడా మానేసి పక్క కాలనీలకు వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోంది.

- రమణ, గిరిజన కాలనీ, నారాయణరెడ్డిపల్లె, జగనన్న కాలనీ

ఉన్నతాధికారులు చొరవ చూపాలి



పక్కా గృహాలు, తాగునీటి సౌకర్యం, విద్యుత్ సరఫరా లేక ఎన్నో రకాల ఇబ్బందులు పడుతున్న గిరిజన కాలనీకి మౌలిక వసతులు కల్పించాలి. తాగునీటి కోసం జగనన్న కాలనీలోకి బిందెలు తీసుకుని వెళుతున్న గిరిజనులను స్థానికులు నీటిని తెచ్చుకోనివ్వడం లేదు. విద్యుత్ సరఫరా లేక రాత్రిళ్లు గిరిజనులు, చిన్నపిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు గిరిజన కాలనీకి వసతుల ఏర్పాటు, విద్యుత్ సరఫరా, అంగన్వాడీ కేంద్రం, పాఠశాల ఏర్పాటు చేసి గిరిజన పిల్లలు విద్యకు దూరం కాకుండా చూడాలి

- అమావాస్య రెడ్డెయ్య, టీడీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు

శ్మశాన అక్రమితులపై చర్యలు తీసుకోండి

● ఎస్.ఎన్ కాలనీ వాసుల ఫిర్యాదు


కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎన్ కాలనీ వాసులు

రాయచోటి(కలెక్టరేట్), జూలై 22: పెమ్మాడపల్లి రోడ్డు మార్గంలోని సర్వే నెంబర్ 801-1 లో విస్తీర్ణం 6:80 సెంట్లు డీకేటీ భూమిని కొందరు ఆక్రమిస్తున్నారని, దీనిని వెంటనే ఆపాలని ప్రజా సమస్యల ఫిర్యాదుల వేదికలో కాలనీ వాసులు శివారెడ్డి, నాగేశ్వర్‌రావు ఫిర్యాదు చేశారు. చాలా కాలంగా హిందువులు చనిపోతే శ్మశాన వాటికలో అంతక్రియలు చేస్తూ వుండేవారు. అయితే దానిని కొందరు రియల్ ఎస్టేట్ చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని డీఆర్‌ఓకు ఇచ్చిన అర్జీలో పేర్కొన్నారు. గతంలో కూడా ఈ విషయంపై చాలా పెద్ద ఎత్తున గందరగోళం చేస్తే అప్పుడున్న తహసీల్దార్ ప్రభుత్వస్థలం అని బోర్డు ఏర్పాటు చేశారని వారు డీఆర్‌ఓకు వివరించారు. ఈ స్థలంపై చుట్టు వున్నా వారి కన్ను పడడంతో మెల్లమెల్లగా ఆక్రమణలకు పూనుకుంటున్నారన్నారు. ఈ విషయంపై చాలా సార్లు తహసీల్దారుకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వారు వాపోయారు. మండిపల్లి రాం ప్రసాద్‌రెడ్డి ప్రభుత్వ భూములు స్వాధీనం చేసుకోవాలని ఇచ్చిన పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వారు తెలిపారు. ఈ విషయాన్ని కలెక్టర్ సీరియస్‌గా తీసుకుని శ్మశాన వాటికను కాపాడవలసిన అవసరం ఎంతైనా పట్టణ ప్రజలు కోరుకోతున్నారు.

ప్రజా సమస్యలను త్వరగా పరిష్కరించాలి : డీఆర్ఓ


అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్ఓ సత్యనారాయణ

రాయచోటి(కలెక్టరేట్), జూలై 22: ప్రజా సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులకు డీఆర్ఓ సత్యనారాయణ సూచించారు. సోమవారం కలెక్టరేట్లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల వినతులు స్వీకరించిన వారు మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచీ వచ్చిన ప్రజలకు పరిష్కారం అందేలా అధికారులంతా క్షేత్రాస్థాయిలోకి వెళ్లి సమస్యలు పరిష్కరించాలన్నారు. ప్రజలను పదేపదే కార్యాలయం చుట్టు తిప్పకుండా వారికి అర్థమయ్యేలా పరిష్కార మార్గం చుపాలన్నారు. వచ్చే వారంలోపు సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

జిల్లా స్థాయి తైక్వాండోలో సత్తా చాటిన కడప క్రీడాకారులు


మెడల్స్ సాధించిన బాల, బాలికలను అభినందిస్తున్న సురేష్‌బాబు

కడప (స్పోర్ట్స్) జూలై 22: ప్రొద్దుటూరు దేవాంగ కల్యాణమండపంలో ఈనెల 21న ఆదివారం జరిగిన జిల్లా స్థాయి తైక్వాండ్ పోటీల్లో కడప క్రీడాకారులు సత్తా చాటారు. జిల్లా తైక్వాండో సెక్రటరీ మాస్టర్ నాయబ్‌రసూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో సుమారు 180 మంది బాల, బాలికలు పాల్గొన్నారు ఇందులో కడపకు చెందిన తైక్వాండో మాస్టర్ షేక్ జంషీర్ వద్ద శిక్షణ తీసుకున్న బాల, బాలికలు గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించారు. ఆ మేరకు సోమవారం కడప నగర మేయర్ కె. సురేష్‌బాబు మెడల్స్ సాధించిన బాల, బాలికలను అభినందించారు.

'భవన నిర్మాణ కార్మికుల సభ్యత్వ నమోదు'

కడప (మారుతీనగర్) జూలై 22: భవననిర్మాణ కార్మికుల అభివృద్ధి, సంక్షేమం కోసం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో సభ్యత్వ నమోదు చేపడుతున్నట్లు కేంద్ర భవన నిర్మాణ సలహామండలి చైర్మన్ శ్రీనివాసులునాయుడు తెలిపారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేఖరులతో ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో భవననిర్మాణ రంగాన్ని కుదేలు చేసేలా జగన్‌రెడ్డి ఇసుకను బంగారం చేసి కార్మికులకు పనిలేకుండా చేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 75 లక్షలకు పైగా భవన నిర్మాణ కార్మికుల్లో కేవలం 30 లక్షల మంది మాత్రమే రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. మిగతావారు సరైన అవగాహన లేక రిజిస్ట్రేషన్ చేసుకోలేక పోయారన్నారు. దీంతో భవన నిర్మాణ రంగంపై ఆధారపడి జీవిస్తున్న వారికి కేంద్రం, రాష్ట్రం ద్వారా అందే వివిధ పథకాలను అందిపుచ్చుకోలేక నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భవన నిర్మాణ సమయంలో అనుకోకుండా కార్మికుడు మరణిస్తే ప్రభుత్వ సాయం అందుతుందన్నారు. కావున భవన నిర్మాణరంగ కార్మికులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకుని, వివాహ, గర్భిణీ, విద్య, ప్రమాద బెనిఫిట్స్ అందిపుచ్చుకోవాలని కోరారు. సమావేశంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు కర్నాటి యల్లారెడ్డి, మధుసూధన్‌రెడ్డి, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

'గండికోట'లో 1.6 టీఎంసీల నీటిమట్టం

కొండాపురం, జూలై 22: గండికోట ప్రాజెక్టులో సోమవారం సాయంత్రానికి 1.66 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. ప్రస్తుతం మైలవరం జలాశయానికి 410 క్యూసెక్కుల నీరు వదులుతున్నట్లు డీఈ తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో లేదన్నారు. కాగా గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 26.85 టీఎంసీలు.

పాము కాటుకు మహిళ మృతి


లక్ష్మమ్మ మృతదేహం

మైదుకూరు రూరల్ జూలై 22: అర్ధరాత్రి మరుగుదొడ్డికి వెళ్లిన ఇండ్ల లక్ష్మమ్మ (60) రక్తపింజరి కాటుకు గురై మృతి చెందిందని బంధువులు తెలిపారు. మైదుకూరు మున్సిపాలిటీ పరిధి 22వ వార్డు, వెంకటసుబ్బయ్య కాలనీ వాసి ఇండ్ల లక్ష్మమ్మ ఆదివారం అర్ధరాత్రి బాత్రుమ్‌కు వెళ్లింది. ఇదే సమయంలో అక్కడ రక్తపింజరి పాము కాటుకు గురైంది. ఆస్పత్రికి తీసుకెళ్లగా మరణించినట్లు వారి బంధువులు తెలిపారు. టీడీపీ సీనియర్ నేత ఆకుల క్రిష్ణయ్య వారి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం చేశారు.

మహిళపై అత్యాచార యత్నం

చాపాడు, జూలై 22: మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిపై సోమవారం ఉదయం అత్యాచార యత్నం జరిగినట్లు పోలీసులు తెలిపారు. పశువులకు మేత పెడుతుండగా అదే గ్రామానికి చెందిన బయపురెడ్డి శ్రీనివాసులరెడ్డి ఆమెను పక్కకు తీసుకుపోవాలని ప్రయత్నించినట్లు తెలిపారు. ఆ మహిళ వెంటనే కేకలు వేయడంతో పలువురు గ్రామస్థులు, బంధువులు వెళ్లడంతో శ్రీనివాసులరెడ్డి అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు చెప్పారు. బాధితురాలి భర్తతో కలిసి ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

హత్యకేసులో నిందితుడు అరెస్టు

కడప క్రైం జూలై 22: కడప నగరం బిల్టప్ సర్కిల్ సమీపంలో రౌడీషీటర్ చింపిరి వెంకటేష్ హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు తాలుకా సీఐ తిమ్మయ్య తెలిపారు. సీఐ వివరాల మేరకు కడప అంబాభవాని నగర్ వాసి వెంకటేష్‌కు రవీంద్ర నగర్‌కు చెందిన సాధక్ వల్లి నడుమ మనస్పర్ధలున్నాయి. ఈనెల 19వతేదీ రాత్రి బిల్టప్ వద్ద ఇద్దరూ మద్యం తాగినట్లు తెలిపారు. వారి నడుమ మాటామాట పెరిగిందని సాదక్ వల్లి మద్యం సీసాతో వెంకటేష్ గొంతుపై పొడిచి దారుణాంగా హత్య చేసినట్లు తెలిపారు. ఈహత్య కేసులో నిందితుడు సాధక్ వల్లిని సోమవారం అతడి ఇంటివద్ద అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

సాఫ్ట్ వేర్ ఉద్యోగి ఆత్మహత్య

కడప క్రైం జూలై 22: కడప నగరం దేవుని కడపకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బొగ్గుల గురులక్ష్మీ (32) సోమవారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు దేవుని కడపకు చెందిన గురులక్ష్మీ మైసూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుండేది ప్రస్తుతం ఆమె వర్క్‌ఫ్రమ్ ఓమ్ ఇంటి వద్దనే పనిచేస్తోంది. భర్త విశ్వనాథ్, కొడుకు కుమార్తెతో ఇంటి వద్దే ఉంటున్నారు. కొంత కాలంగా ఆమె ఆనారోగ్యంతో బాధపడుతూ ఉండేదని తెలిపారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని రిమ్స్‌కు తరలించి ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

వైవీయూ వైస్ ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ పద్మ


ప్రొఫెసర్ పద్మకు నియామక పత్రాన్ని అందజేస్తున్న వీసీ

కడప ఎడ్యుకేషన్, జూలై 22: వైవీయూ పీజీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా ఇంగ్లీషు డిపార్టుమెంట్ ప్రొఫెసర్ పి. పద్మ, నియమితులయ్యారు. వైవీయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ కె. కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఎస్. రఘునాథరెడ్డి ఆమెకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ స్థానంలో పనిచేసిన ప్రొఫెసర్ షావల్లిఖాన్, కర్నూలు ఉర్దూ యూనివర్శిటీ వీసీగా నియమితులు కావడంతో అతని స్థానంలో ఆమెను నియమించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పోరుమామిళ్ల వాసులు

పోరుమామిళ్ల, జూలై 22: ఆగస్టులో అనంతపురం జిల్లా తాడిపత్రిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పోరుమామిళ్ల వాసులు అర్హత సాధించారని మాస్టర్ నాయబ్ రసూల్ తెలిపారు. 21న ఆదివారం ప్రొద్దుటూరు దేవాంగ ఫంక్షన్ హాల్‌లో జిల్లా స్థాయి పోటీలు జరిగాయన్నారు. ఈ పోటీ ల్లో సబ్ జూనియర్, సీనియర్ విభాగంలో 32 మంది బంగారు పతకాలు, 16 మంది రజత పథకాలు, 14 మంది కాంస్యపథకాలు, సాధించా రన్నారు. వీరికి ప్రొద్దుటూరు డీఎస్పీ మురళీధర్, జిల్లా తైక్వాండో ప్రెసిడెంట్ శివశంకర్‌రెడ్డి, బహుమతులు అందజేశారని ఆయన తెలిపారు.

విద్యుత్ విజిలెన్స్ ఆకస్మిక తనిఖీ

● 35మందిపై కేసులు నమోదు
● రూ.4లక్షలు జరిమానా


ట్రాన్స్‌ఫార్మర్‌ను తనిఖీ చేస్తున్న దృశ్యం

ఎర్రగుంట్ల, జూలై 22: ఎర్రగుంట్ల టౌన్, మండలపరిధి వివిధ గ్రామాల్లో విద్యుత్ విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీ చేపట్టారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 35మందిపై కేసులు నమోదు చేశారు. వారిపై రూ.4లక్షల అపరాద రుసుం విధించారు. విద్యుత్ చౌర్యంపై ఇటీవల ఇన్ని కేసులు పెట్టడం గమనార్హం. తిరుపతి, కడప నుంచి 10 మందితో కూడిన అధికారుల బృందం పరిశ్రమలు, గనులు, మరికొన్ని మేజర్ విద్యుత్ వాడకం ఉన్న వాటిని తనిఖీ చేశారు. తుమ్మలపల్లె, పెద్దనపాడు, నిడిజువ్వి గనులు, టౌన్‌లోని వివిధ పరిశ్రమలు తనిఖీ నిర్వహించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో ఎస్ఈ ఏ.శ్రీనివాసబాబు, ఈఈ కే.రమేష్, డీఈలు మధుసూదన్‌రావు, మధులత, ఎర్రగుంట్ల ఆపరేషన్ డీఈఈ కిరణ్‌కుమార్, ఏఈలు నాగరాజు, వీరాంజనేయరెడ్డి, రవికుమార్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ మధుసూదనరెడ్డిపై చర్యలు తీసుకోవాలి

● కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుర్రప్పనాయుడు


మాట్లాడుతున్న కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుర్రప్పనాయుడు తదితరులు

కడప(రూరల్) జూలై 22: మాజీ ప్రభుత్వ ప్లీడర్ గడ్డ గుర్రప్ప కుమారుడు నవదీప్‌పై వన్ టౌన్ ఎస్ఐ మధుసూదనరెడ్డి విచక్షణారహితంగా కొట్టి గాయపరచడం దారుణమని ఇతనిపై చట్టపరమైన చర్యలు తీసుకుని విధుల నుంచి తొలగించాలని కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుర్రప్పనాయుడు డిమాండ్‌చేశారు. సోమవారం జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తన పేరు చెప్పి లాయర్‌గా పరిచయం చేసుకుని తన కుమారుడు నవదీప్‌ను కొట్టడంపై ఎస్ఐని అడిగితే ఆయన నీవు ఎవరివైతే నాకేంటి నీకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదని అతనిపై కూడా దర్పాషలాడడం దారుణమన్నారు. ఎస్ఐ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కొట్టే అధికారం ఎవరిచ్చారని ప్రశ్నించా రు. ఎందుకు కొట్టారో విశ్లేషణ ఇవ్వాలన్నారు. ఎస్ఐపై చట్టపర చర్యలు తీసుకుని వెంటనే విధులను నుంచి తొలగించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ప్రభుత్వ ప్లీడర్ గడ్డ గుర్రప్ప, బార్ అసోసియేషన్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి అండర్-19 మెన్స్ మల్టీడే క్రికెట్ మ్యాచ్‌లు

కడప (స్పోర్ట్స్) జూలై 22: కడపలో 24వ తేదీ బుధవారం నుంచి ఆగస్టు 19 వరకూ అండర్-19 మెన్స్ మల్టీడే ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లు జరుగనున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ వెల్లడించారు. ఈ మ్యాచ్‌లు రిమ్స్‌సమీప వై.ఎస్.రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియం, కేఎస్ఆర్ఎం, కేఓఆర్ఎం క్రికెట్ మైదానాల్లో జరుగనున్నాయన్నారు. క్రిష్ణా, విశాఖ, చిత్తూరు, కడప, నెల్లూరు, వెస్ట్ గోదావరి, శ్రీకాకుళం జట్లు పాల్గొంటున్నాయన్నారు.

తేదీ	వివిధ జట్లు	ప్రదేశం
24 నుంచి 26	కడప- వెస్ట్‌గోదావరి	వైఎస్ రాజారెడ్డి క్రికెట్ మైదానం
24నుంచి 26	విశాఖ- చిత్తూరు	కేఎస్ఆర్ఎం
24నుంచి 26	శ్రీకాకుళం- నెల్లూరు	కేఓఆర్ఎం
	జూలై 27 విశ్రాంతి రోజు	
28నుంచి 30	క్రిష్ణా- చిత్తూరు	వైఎస్ రాజారెడ్డి క్రికెట్ మైదానం
28నుంచి 30	శ్రీకాకుళం- కడప	కేఎస్ఆర్ఎం
28నుంచి 30	విశాఖ- వెస్ట్‌గోదావరి	కేఓఆర్ఎం
	జూలై 31 విశ్రాంతి దినం	
ఆగస్టు 1నుంచి 3	చిత్తూరు- నెల్లూరు	వైఎస్ రాజారెడ్డి క్రికెట్ మైదానం
ఆగస్టు 1నుంచి 3	క్రిష్ణా- వెస్ట్ గోదావరి	కేఎస్ఆర్ఎం
ఆగస్టు 1నుంచి 3	విశాఖ- శ్రీకాకుళం	కేఓఆర్ఎం
	ఆగస్టు - 4 విశ్రాంతి దినం	
ఆగస్టు 5నుంచి 7	క్రిష్ణా- శ్రీకాకుళం	వైఎస్ రాజారెడ్డి క్రికెట్‌మైదానం
ఆగస్టు 5నుంచి 7	చిత్తూరు-వెస్ట్‌గోదావరి	కేఎస్ఆర్ఎం
ఆగస్టు 5నుంచి 7	నెల్లూరు- కడప	కేఓఆర్ఎం
	ఆగస్టు 8 విశ్రాంతి దినం	
ఆగస్టు 9నుంచి 11	క్రిష్ణా- కడప	వైఎస్ రాజారెడ్డి క్రికెట్ మైదానం
ఆగస్టు 9నుంచి 11	విశాఖ- నెల్లూరు	కేఎస్ఆర్ఎం
ఆగస్టు 9నుంచి 11	శ్రీకాకుళం- వెస్ట్‌గోదావరి	కేఓఆర్ఎం
	ఆగస్టు 12 విశ్రాంతి దినం	
ఆగస్టు13నుంచి15	క్రిష్ణా- విశాఖ	వైఎస్ రాజారెడ్డి క్రికెట్ మైదానం
ఆగస్టు13నుంచి15	చిత్తూరు-కడప	కేఎస్ఆర్ఎం
ఆగస్టు13నుంచి15	నెల్లూరు-వెస్ట్‌గోదావరి	కేఓఆర్ఎం
	ఆగస్టు- 16 విశ్రాంతి దినం	
ఆగస్టు17నుంచి19	విశాఖ- కడప	వైఎస్‌రాజారెడ్డి స్టేడియం
ఆగస్టు17నుంచి19	చిత్తూరు- శ్రీకాకుళం	కేఎస్ఆర్ఎం
ఆగస్టు17నుంచి19	క్రిష్ణా- నెల్లూరు	కేఓఆర్ఎం

ప్రతి గ్రామంలో శాఖ ఏర్పాటు చేయాలి

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈశ్వరయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వరయ్య

రాయచోటిటౌన్, జూలై 22: జిల్లాలో గ్రామాల వారీగా సీపీఐ ప్రజా సంఘాల నిర్మాణాత్మకంగా శాఖలు ఏర్పాటు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. సోమవారం రెండవ రోజు జరిగిన జిల్లా విస్తృత సమావేశం, కౌన్సిల్ కార్యవర్గ సమావేశంలో కేవీవీ ప్రసాద్‌తో కలిసి ఆయన మాట్లాడారు. ప్రజా సంఘాల నిర్మాణాత్మకమైన చర్చలు జరిపి సీపీఐ, వాటి ప్రజా సంఘాలు గ్రామాల వారీగా జిల్లాలో బలోపేతం కావాలన్నారు. వంద సంవత్సరాల శత జయంతి ఉత్సవాలు జరుపుకుంటున్న సీపీఐ పేద, బడుగు, బలహీన, అణగారిన వర్గాల కోసం స్వాతంత్ర ఉద్యమంలో అనేక కుట్రలు, కేసులకు గురైందన్నారు. ఈ నెల 29 నుంచి 31 వరకు మదనపల్లిలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర సమ్మేళనాలు ఉంటాయని, అలాగే పార్టీ నియోజకవర్గ, మండలశాఖ కార్యదర్శులకు, ప్రజాసంఘాల నాయకులకు ఆగస్టు 20 నుంచి 22 వరకు రైల్వేకోడూరు నియోజకవర్గంలో జిల్లా స్థాయి వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివారెడ్డి, జిల్లా కార్యదర్శి నరసింహులు, సహాయ కార్యదర్శి పి.మహేశ్, కార్యవర్గ సభ్యులు కృష్ణప్ప, శ్రీనివాసులు, సాంబశివ, మండెం సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బోధన పరికరాలు ఎంతో ఉపయోగకరం

సంబేపల్లె, జూలై 22: విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలకు బోధన పరికరాలు ఎంతో ఉపయోగపడతాయని జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ శ్రీనివాసరాజు తెలిపారు. సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు, డీఈవో శివప్రకాశ్‌రెడ్డి ఆదేశాల మేరకు పాఠశాలలో 22 నుంచి 28 వరకు శిక్షా సప్తాహ్ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోమవారం సంబేపల్లె ఉన్నత పాఠశాల మోడల్ పాఠశాలలో స్థానికంగా లభించే వనరుల ద్వారా లోకాస్ట్ నో కాస్ట్ బోధన అభ్యసన సామగ్రి ప్రదర్శన చేశారు. 23న పునాది అభ్యసన కార్యక్రమం, 24న క్రీడా దినోత్సవం, 25న సాంస్కృతిక దినోత్సవం, 26న సాంకేతిక నైపుణ్యాల దినోత్సవం, 27న పర్యావరణ పరిరక్షణ దినోత్సవం, 28న సామాజిక భాగస్వామ్య దినోత్సవం కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరసింహారెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్, జిల్లా సైన్స్ అధికారి ఓబుల్‌రెడ్డి, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

పండుగ వాతావరణంలా శిక్షా సప్తాహ్


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ

లక్కిరెడ్డిపల్లె,జూలై 22: జాతీయ విద్యావిధానం-2020లో ప్రవేశ పెట్టిన, శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో పండుగ వాతావరణంలా నిర్వహించారు. జాతీయ విద్యావిధానం శిక్షా సప్తాహ్ 4వ వారోత్సవం సందర్భంగా అన్ని పాఠశాలలో ఆకు కూరలు, కూరగాయలతో విద్యార్థులు రకారకాల సప్తాహ్‌లు తయారు చేశారు. సోమవారం స్థానిక ఎమ్మార్సీ భవనంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులచే తక్కువ ఖర్చుతో దొరికే అభ్యసన కూరగాయల ఆహార దినుసులతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం జూలై 29 వరకు ప్రతి పాఠశాలలో నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ శివశంకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు మధుసూదన్‌రెడ్డి, సాయివెన్నెల, విద్యార్థులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

విచారణ చేపట్టాలి : సీపీఐ

లక్కిరెడ్డిపల్లె, జూలై 22: మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో జరిగిన అగ్ని ప్రమాదంపై అనేక అనుమానాలు ఉన్నాయని, భూ ఆక్రమణదారులు తమ గుట్టు బయటపడుతుందన్న ఉద్దేశంతో గుట్టుచప్పుడు కాకుండా కాగితాలు తగలపెట్టారని, జరిగిన అగ్ని ప్రమాదంపై సిట్టింగ్ సీఐడీ, సిట్టింగ్ జడ్జీలతో పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసి నేత అంకన్న డిమాండ్ చేశారు. సోమవారం ఆయన లక్కిరెడ్డిపల్లెలో విలేకర్లతో మాట్లాడారు. జరిగిన సంఘటనలు సీసీ కెమెరాల ద్వారా పరిశీలించి నిందితులను శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

ముగ్గురు ఎర్రచందనం స్మగ్లర్లు అరెస్ట్

● ఏడు దుంగలు - రెండు మోటారుసైకిళ్లు స్వాధీనం


దుంగలను స్వాధీనం చేసుకుని నిందితులను అదుపులోకి తీసుకొన్న అటవీ సిబ్బంది

రాజంపేట, జూలై 22: రాజంపేట పరిధిలోని కావలిపల్లె రాయవరం సెక్షన్ వద్ద మామిడి తోటలో 7 ఎర్రచందనం దుంగలు, 2 మోటారుబైకులు స్వాధీనం చేసుకుని ముగ్గురు స్మగ్లర్లను టాస్క్‌ఫోర్సు పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. టాస్క్‌ఫోర్స్ ఇన్‌ఛార్జి తిరుపతి ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు ఆదేశాలతో టాస్క్‌ఫోర్సు ఎస్పీ పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నుంచి రాజంపేట సమీపంలోని సానిపాయ రేంజిలోని రాయవరం నుంచి ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లను తనిఖీ చేసుకుంటూ వెళ్లారు. సోమవారం తెల్లవారుజామున రెడ్డివారిపల్లె, మాచిరెడ్డిగారిపల్లె రోడ్డుకు తూర్పు వైపు ఉన్న మామిడితోట వద్దకు చేరుకున్నారు. అక్కడ మూడు మోటారు సైకిళ్లపై కొందరు వ్యక్తులు కూర్చొని ఉండగా, వారిని చుట్టుముట్టారు. ఇందులో ఒకరు మోటారు సైకిల్‌లో పారిపోగా, మిగిలిన ముగ్గురిని పట్టుకుని విచారించినట్లు తెలిపారు. సమీపంలో ఎర్రచందనం దుంగల డంప్‌ను స్వాధీనం చేసుకున్నామని, పట్టుబడిన వారిలో జిల్లేళ్ల మంద పంచాయతీకి చెందిన జి.సురేష్, జి.అశోక్, మాచిరెడ్డిపల్లెకు చెందిన తిరుమలయ్యలను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. సీఐ శ్రీనివాసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వివేకా హత్య కేసు నిందితుడు దస్తగిరి హల్‌చల్

● ల్యాండ్ సెటిల్మెంట్ కోసం రాయచోటికి


బాధితులతో మాట్లాడుతున్న దస్తగిరి

రాయచోటిటౌన్, జూలై 22: పట్టణంలోని షేక్.ఖాసీంసాబ్, ఇనాముల్లాలకు సంబంధించిన భూమిని కొంత మంది వైసీపీ నేతలు కబ్జా చేశారన్న ఆరోపణలతో సోమవారం పులివెందులకు చెందిన వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుడు దస్తగిరి రాయచోటికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన కబ్జాకు గురైన సర్వే నెంబర్ 804లో ఒక ఎకరా 25 సెంట్లు భూమిని పరిశీలించి బాధితులు ఖాసీంసాబ్, ఇనాముల్లాలకు ధైర్యం చెప్పారు. అలాగే రాయచోటి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి సదరు సమస్యపై ఆరాతీశారు. ఈ సందర్భంగా బాధితులు ఖాసీంసాబ్, ఇనావుల్లాలు మీడియాతో మాట్లాడుతూ తమ తాతల కాలం నుంచి తమ ఆధీనంలో ఉన్న భూమిని వైసీపీ నేతలు కబ్జా చేశారంటూ కోర్టుకు వెళ్లడమే కాకుండా అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా ఫలితం లేకపోవడంతో దస్తగిరిని కలిశామన్నారు. కబ్జాదారుల నుంచి తమ భూమిని ఇప్పించాలని బాధతులు కోరుతున్నారు. తమ భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని బాధితులు ఖాసీంసాబ్, ఇనాముల్లాలు అధికారులకు విజ్ఞప్తి చేశారు. వైసీపీ నేతలు కబ్జా చేసిన తమ భూమి ఇప్పించే వరకు పోరాడుతూనే ఉంటామని బాధితులు అంటున్నారు.

వేడుకగా వీరభద్రుడి పల్లకీ ఉత్సవం

రాయచోటిటౌన్, జూలై 22: దక్షిణకాశీగా పేరుగాంచిన భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో సోమవారం పల్లకీ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో రమణారెడ్డిల ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య స్వాముల వేదమంత్రోచ్ఛారణల మధ్య భద్రకాళీ సమేత వీరభద్రుడు ఉత్సవ విగ్రహాలను అభిషేకాలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలు, పట్టు వస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి పల్లకీ ఉత్సవంపై ఆలయం చుట్టూ మాడవీధుల్లో ప్రదక్షిణలు నిర్వహించారు.

అక్రమ కేసులను ఎత్తివేయాలి

గాలివీడు, జూలై 22: గత వైసీపీ ప్రభుత్వం సర్పంచులపై అక్రమంగా బనాయించిన కేసులను ఎత్తివేయాలని ఏపీ సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పూలకుంట సర్పంచ్ పార్థసారధిరెడ్డి కోరారు. ఆయన సోమవారం గాలివీడులో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు మంజూరైన నిధులను దొంగదారిన ఇతర పనులకు మళ్లించుకున్నదని, తద్వారా పంచాయతీలు అభివృద్ధికి నోచుకోలేక నిర్వీర్యమైపోయాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ మోపూరి రమణయ్య, రామాంజులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'అక్రమాలు జరిగాయి.. రికార్డులు జాగ్రత్త'

సుండుపల్లె, జూలై 22: వైసీపీ పాలనలో అక్రమాలు తారాస్థాయిలో జరిగాయని, రికార్డులు జాగ్రత్త అని రాజంపేట పార్లమెంట్ ఉపాధ్యక్షుడు భగవాన్ సహాయరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సోమవారం మాట్లాడుతూ మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో రికార్డులను కాల్చివేయడం వైసీపీ అరాచకాలకు పరాకాష్ట అని తీవ్రంగా విమర్శించారు. పెద్దిరెడ్డి అరాచకాలను కప్పిపుచ్చేందుకేనా అని అనుమానాలు వ్యక్తం చేశారు. మదనపల్లె లాంటి ఘటనలు మరలా జరగకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు.

సిమెంట్ రోడ్డుకు భూమిపూజ

చిట్వేలి, జూలై 22: మండల పరిధిలోని నాగవరం పంచాయతీ ఉప్పరపల్లిలో నిర్మించనున్న సిమెంట్‌రోడ్డుకు సోమవారం రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి కూటమి నేతలతో కలిసి భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాలకు రవాణా సౌకర్యం కల్పించడానికి ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఉప్పరపల్లెలో రూ.12 లక్షలతో 220 మీటర్ల రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహ ప్రసాద్, మండల టీడీపీ అధ్యక్షుడు కేకే చౌదరి, గుండయ్య నాయుడు, గుత్తి నరసింహ, అనితదీప్తి, మాలే బాబు, శివయ్య, వెంకటేశ్, బాబూజీ రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోపణలు తగదు

● మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు జయరాజ్

ఓబులవారిపల్లె, జూలై 22: నిజాయితీగా పనిచేసే అధికారిపై ఆరోపణలు తగదని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు జయరాజ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వారు చేసే అవినీతి పనులకు సమకరించలేదని ఏపీఎండీసీ సంస్థలో హెచ్‌ఆర్‌డీఏ జీఎంగా ఉన్న జోసెఫ్‌పై అవినీతి బురద జల్లడం తగదన్నారు. ఆధిపత్యం, కుల రాజకీయాలు మానుకొని ఆయన సేవలు వినియోగించుకోవాలని తెలిపారు.

సుగవాసిని కలిసిన టీడీపీ నేతలు


ప్రసాద్‌బాబుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న దృశ్యం

రాయచోటిటౌన్, జూలై 22: పట్టణంలోని గాలివీడు రోడ్డులో గల టీడీపీ కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాద్‌బాబును సోమవారం మండలంలోని ముడుంపాడు గ్రామ టీడీపీ నాయకుడు కంచన రెడ్డెయ్య ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ యూత్ రెడ్డిశేఖర్, నాగేశ్వర్, మధు, నగేశ్, నాగార్జున, నాగరాజ, శంకర, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

లక్కిరెడ్డిపల్లె, జూలై 22: దిన్నెపాడు వడ్డెపల్లెలో ఏడాది నుంచి తాగునీటితో ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, సమస్యను త్వరగా పరిష్కరించాలని డి.వడ్డెపల్లె గ్రామస్తులు సోమవారం స్పందనలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. వర్షాలు సక్రమంగా కురవకపోవడంతో గ్రామంలో నీటి సమస్య తీవ్రంగా ఉందని, గ్రామంలోని మంచినీటి పథకం, బోర్లు, చేతిపంపులు ఎండిపోయి సంవత్సరం గడుస్తున్నా పట్టించుకోవడం లేదని వారు తెలిపారు. కలెక్టర్ చొరవ చూపి తమ గ్రామానికి 3 ట్యాంకర్లను ఏర్పాటు చేసి నీటిని అందించాలని వారు పేర్కొన్నారు.

'అరాచకాలకు సమాధానం చెప్పాలి'

ఒంటిమిట్ట, జూలై 22: రాష్ట్రంలో అరాచకాలకు జగన్‌మోహన్‌రెడ్డి సమాధానం చెప్పాలని మండల టీడీపీ నాయకుడు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ఢిల్లీలో జగన్ ధర్నా చేస్తున్నారని, రాష్ట్రంలోని బీసీలు, ఎస్సీలపై దాడులు చేసి హత్యలు చేసిన చరిత్ర జగన్‌ది అని గుర్తు చేశారు. సోమవారం స్థానిక హరిత హోటల్‌లో మాజీ రాష్ట్ర డైరెక్టర్ కొమరా వెంకటనరసయ్య స్థానిక టీడీపీ నాయకులతో కలిసి పత్రికా సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బీవీ రమణ, నరసింహులు, రేవిళ్ల బాలమునెయ్య, రఘురామిరెడ్డి, పసుపులేటి రమణ, చాన్‌బాషా, మునగపాటి రమణ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధం

● భయాందోళనకు గురైన ప్రజలు

పుల్లంపేట, జూలై 22: మండల కేంద్రమైన పుల్లంపేటలో ఏపీజీబీ ఎదురుగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లో సోమవారం రాత్రి ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. మంటలు పెద్దఎత్తున వ్యాపించడంతో అప్రమత్తమైన స్థానికులు విద్యుత్‌శాఖ సిబ్బందికి తెలియజేశారు. వెంటనే కరెంటు సరఫరాను నిలిపివేశారు. వంద కిలోలు వాట్ సామర్థ్యం గల ఈ ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే 63 కిలోవాట్ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. సకాలంలో స్థానికులు స్పందించడం వల్ల పెద్ద ప్రమాదమే తప్పింది. లేని పక్షంలో రెండు ట్రాన్స్‌ఫార్మర్లు దగ్ధమయ్యేవి. వెంటనే విద్యుత్ సిబ్బంది సరఫరాను పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టారు.

ఫైళ్ల కాల్చివేతలో వైసీపీ కుట్ర

● రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు



రాయచోటి టౌన్, జూలై 22: మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన అగ్నిప్రమాదం వెనుక వైసీపీ కుట్ర దాగి ఉందని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నారు. సోమవారం ఆయన రాయచోటి పట్టణంలో మీడియాతో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయం పరిధిలో జరిగిన భూఅక్రమాలతో పాటు వైసీపీ పెద్దలు ఆక్రమించిన పేదల భూములను తిరిగి వారికి స్వాధీనం చేసే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఒక నిజాయితీ గల ఐఏఎస్ అధికారిని మదనపల్లె సబ్ కలెక్టర్‌గా నియమించిందన్నారు. మరికొన్ని గంటల్లో మదనపల్లె సబ్ కలెక్టర్‌గా ఐఏఎస్ అధికారి మేఘస్వరూప్ బాధ్యతలు స్వీకరించనుండటంతో తమ అవినీతి, అక్రమాలు ఎక్కడ బయట పడతాయోనన్న భయంతో వైసీపీ పెద్దలు కుట్ర పన్ని సబ్ కార్యాలయంలోని రికార్డులను కాల్చివేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. కార్యాలయంలో ఎటువంటి షార్ట్ సర్క్యూట్ జరగలేదని, కేవలం గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అక్రమాలకు సంబంధించిన రికార్డులు ఉన్న కొత్త భవనంలోనే ఈ అగ్నిప్రమాదం జరగడం వెనుక పెద్దిరెడ్డి, అతడి అనుచరుల హస్తం ఉందన్న అనుమానులు సర్వత్రా ఉన్నాయన్నారు. దీనిపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

డయేరియాపై అవగాహన ఉండాలి

● రాయచోటి మున్సిపల్ కమిషనర్ వాసుబాబు


బాలికలకు అవగాహన కల్పిస్తున్న కమిషనర్

రాయచోటిటౌన్, జూలై 22: డెంగ్యూ, మలేరియా, డయేరియాపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని మున్సిపల్ కమిషనర్ వాసుబాబు, డాక్టర్ సాయికీర్తి, మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.ప్రసాద్ యాదవ్‌లు తెలిపారు. డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా సోమవారం రాయచోటి ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హాస్టల్ పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు, పిచ్చిమొక్కలు లేకుండా చేసుకోవాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీటి నిల్వ ఉంచిన డ్రమ్ముల్లో, తొట్లలో లార్వాలు ప్రబలకుండా నీటిని శుద్ధి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లత, సబ్‌యూనిట్ అధికారి జయరామయ్య, మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, హెల్త్ సూపర్‌వైజర్ నూర్జహాన్, ఏఎన్‌యం సలీమా, ఉపాధ్యాయులు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ రవాణాపై కలెక్టర్‌కు ఫిర్యాదు

సుండుపల్లె, జూలై 22: ఇసుక, మట్టి అక్రమ రవాణా యథేచ్ఛగా జరుగుతుందని మండలంలోని ఏటిగడ్డ రాచపల్లెకు చెందిన కొండూరు రవీంద్రరాజు సోమవారం రాయచోటిలోని కలెక్టర్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మండల కేంద్రానికి సమీపంలోని గుట్టకాడ బలిజపల్లె సమీపంలోని ప్రభుత్వ భూమిలో గుట్టల నుంచి జేసీబీ యంత్రాలతో తవ్వి ట్రాక్టర్ల ద్వారా మట్టి తరలిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. రెవెన్యూ, పోలీసు అధికారులకు, సిబ్బందికి చెప్పినా ఫలితం లేకుండా పోయిందన్నారు. నిత్యం పోలీస్‌స్టేషన్, తహసీల్దార్ కార్యాలయాల సమీపం నుంచి పదుల సంఖ్యలో ట్రాక్టర్ల మట్టి రవాణా చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

ఐఐటీలో కోడూరు విద్యార్థికి సీటు



రైల్వేకోడూరు, జూలై 22: ఐఐటీలో కోడూరు విద్యార్థి సీటు సాధించాడు. కోడూరు రాంనగర్‌కు చెందిన కాలవ రవీంద్ర, గిరిజనులకు చెందిన కుమారుడు కాలవ స్నేహిత్‌సాయి అనే విద్యార్థి ఈ ఏడాది జేఈఈ మెయిన్స్, జేఈఈ అడ్వాన్సు ర్యాంకును సాధించడంతో ఐఐటీ ద్వారా యూనివర్శిటీలో సీటు సాధించినట్లు తల్లిదండ్రులు సోమవారం తెలిపారు. స్నేహిత్‌సాయి రైల్వేకోడూరు నారాయణ స్కూలులో పదివరకు చదువుకుని, విజయవాడ నారాయణలో ఇంటర్ పూర్తి చేశాడు. ఐఐటీకి ప్రిపేర్ అయి జేఈఈ మెయిన్స్, అడ్వాన్సుల్లో మంచి ర్యాంకు సాధించడంతో ఐఐటీ సీటును సాధించాడని వారు తెలిపారు. స్నేహిత్ సాయికి ఐఐటీలో సీటు రావడం పట్ల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

గ్రీవెన్స్‌సెల్‌ను సద్వినియోగం చేసుకోండి


గ్రీవెన్‌సెల్‌లో మాట్లాడుతున్న తహసీల్దార్

రామాపురం, జూలై 22: ప్రతి సోమవారం జరిగే గ్రీవెన్స్ సెల్ కార్యక్రమాన్ని అన్ని గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారంలో ఎప్పటికప్పుడు నిర్లక్ష్యం వహించరాదని, రైతులు తమ గ్రామాల పరిధిలోని సమస్యలను తహసీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు. ప్రధానంగా భూములకు సంబంధించిన అర్జీలపై రైతులు అధికంగా భూసర్వే చేయాలని ఫిర్యాదు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఏఈ వరప్రసాద్‌రెడ్డి, ఎంఈవో రామకృష్ణుడు, డిప్యూటీ తహసీల్దార్ సిద్దేశ్వరరావు, ఆర్ఐ రవికుమార్, అంగన్వాడీ సూపర్‌వైజర్ పద్మజ, తదితర అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక


రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైన విద్యార్థులు


రైల్వేకోడూరు, జూలై 22: రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు కోడూరుకు చెందిన విద్యార్థులు జూనియర్ విభాగంలో జి.ఐశ్వర్య, మేఘన, మనోజ్ కుమార్, సీనియర్ విభాగంలో చైతన్యప్రసాద్, విష్ణు, కృష్ణవేణిలు ఎంపికైనట్లు కోచ్ శివాజీ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 21న కోడూరులో ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్ఎస్ స్పోర్ట్సు నందు 40వ సీనియర్, 41వ జూనియర్ విభాగాల్లో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీల్లో విశేషంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఆయన వివరించారు.

పార్టీ బలోపేతమే లక్ష్యం : జనసేన


సభ్యత్వ నమోదు కార్యక్రమంలో శ్రీనివాసరాజు

నందలూరు, జూలై 22: జనసేన పార్టీ బలోపేతమే తన లక్ష్యమని జనసేన పార్లమెంట్ సమన్వయకర్త యల్లటూరు శ్రీనివాసరాజు పేర్కొన్నారు. స్థానిక జనసేనపార్టీ కార్యాలయంలో సోమవారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు కార్యకర్తలకు అండగా ఉండాలనే ఉద్దేశ్యంతో సభ్యత్వ నమోదు ప్రారంభించినట్లు తెలిపారు. ఎవరైనా పార్టీ కార్యకర్తలకు అనుకోని ప్రమాదం సంభవిస్తే ఈ సభ్యత్వం ద్వారా వారి కుటుంబాన్ని ఆదుకోవడానికి వీలుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శివరామరాజు, మాజీ ఎంపీటీసీ నాగేంద్ర, చలపతి, సురేష్, ప్రశాంత్, క్రిష్ణయ్య, క్రిష్ణ, శ్రీను, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకురాలికి డాక్టరేట్



రాజంపేట, జూలై 22: మండల పరిధిలోని బోయనపల్లె అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగంలో సహాయ అధ్యాపకురాలిగా పనిచేస్తున్న షేక్ ఫయాజ్‌బేగంకు జేఎస్ యూనివర్శిటీ ఉత్తరప్రదేశ్ వారిచే పీహెచ్‌డీ ప్రదానం జరిగిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎంవీ నారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ వీరు ఆప్టిమైజింగ్ డేటా డెలివిరి మెకానిజం ఫర్ ఎన్ ఎంన్డ్ ఫర్మామెన్స్ ఇన్ 5 జీ మొబైల్ నెట్‌వర్క్ అంశంపై పరిశోధన చేసినందుకు డాక్టరేట్ ప్రదానం చేశామన్నారు. ఈ సందర్భంగా కళాశాల వ్యవస్థాపకుడు డాక్టర్ గంగిరెడ్డి, చైర్మన్ డాక్టర్ సి.రామచంద్రారెడ్డి, వైస్ చైర్మన్ చొప్పా యల్లారెడ్డి, ఎడ్యుకేషన్ డైరెక్టర్ చొప్పా అభిషేక్‌రెడ్డి, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ సీహెచ్ నాగరాజు, డీన్స్ వివిధ విభాగాధిపతులు, అధ్యాపక బృందం షేక్ ఫయాజ్‌బేగంను అభినందించారు.

హక్కుల కోసం పోరాడితే నిందలా ?



రాజంపేటటౌన్, జూలై 22: విద్యార్థుల హక్కుల కోసం పోరాడితే విద్యార్థి సంఘాల నేతలపై నిందలు వేయడం ఎంతవరకు సబబు అని విద్యార్థి సంఘాలు, నాయకులు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వర తెలిపారు. సోమవారం విలేకరులతో వారు మాట్లాడుతూ ప్రైవేటు స్కూల్ యాజమాన్యాలపై వేధింపులు, దౌర్జన్యాలు చేస్తున్నామని తమపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేయడం సరి కాదన్నారు. ప్రైవేటు విద్యా సంస్థల ఏర్పాటులో నిబంధనలు ఏ ఒక్క పాఠశాల పాటించడం లేదని వాపోయారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బాలసుబ్రమణ్యం, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రమణ, ఐఎఫ్ఎఫ్ఎస్ జిల్లా కార్యదర్శి శెట్టిపల్లె సాయికుమార్, కన్నా, చెంగయ్య, మధు, ప్రసాద్, సాయి, రాజా, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

● వెబ్‌సైట్ ద్వారా ఇలా..



కరెంట్ బిల్లులు
ఫోన్‌తో ఇలా కట్టేద్దాం

క్యూఆర్ కోడ్ అందుబాటులోకి వస్తే ఇంకా సులభం

● యాప్‌తో ఇలా..



ఇదివరకు కరెంటు బిల్లు చెల్లించాలంటే విద్యుత్ కార్యాలయాల వద్దకెళ్లి కట్టేవాళ్లు. ఆ తర్వాత ఆన్‌లైన్, అనంతరం డిజిటల్ పేమెంట్స్ వచ్చాయి. తాజాగా ఇటీవల గూగుల్ పే, ఫోన్‌పే వంటి థర్డ్ పార్టీ యూపీఐ యాప్స్ ద్వారా చెల్లింపులు నిలిపివేసిన విషయం తెలిసిందే. ఈనెల ఒకటో తేదీనుంచి కొత్త ఆర్బీఐ నిబంధనలు అమల్లోకి వచ్చిన నేపథ్యంలో విద్యుత్ వినియోగదారులు ఇకపై ఏపీఎస్పీడీసీఎల్ అధికారిక వెబ్‌సైట్ www.apspdcl.in లేదా దానికి సంబంధించిన యాప్ ద్వారానే చెల్లించాలి. ఇటీవల కాలంలో ఫోన్‌పే, గూగుల్ పేలో కరెంటు బిల్లులు చెల్లించడానికి అలవాటు పడిన వినియోగదారులు ఇప్పుడు వాటికి బ్రేక్ వేయడంతో కొంత గందరగోళంలో పడ్డారు. ఫోన్‌పే, గూగుల్ పేలో చెల్లింపులు సులభంగా ఉండడంతోపాటు నెలవారీ బిల్లును రిమైండ్ చేస్తుంది కూడా. ఒక్క క్లిక్‌తో బిల్లు కట్టేయచ్చు. ఇపుడు ఆ అవకాశం లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. అయితే పక్కరాష్ట్రమైన తెలంగాణలో బిల్లుకింద ఉండే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే డెబిట్, క్రెడిట్ కార్డులు, యూపీఐ, నెట్‌బ్యాంకింగ్ తదితర విధానాల్లో బిల్లులు చెల్లించేలా అక్కడ విద్యుత్ సంస్థ పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొచ్చింది. అక్కడొచ్చే ఫలితాల ఆధారంగా మనదగ్గర కూడా ఈవిధానాన్ని అమలు చేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

- చిత్తూరు రూరల్

●ఆన్‌లైన్ ద్వారా చెల్లించలేనివారు..

ఆన్‌లైన్ ద్వారా చెల్లించలేని వారు మీ దగ్గరలోని విద్యుత్ కార్యాలయం కానీ, సచివాలయం, మీసేవ కేంద్రానికి వెళ్లి బిల్లు చెల్లించవచ్చు.

ఎస్పీడీసీఎల్‌కి చెందిన www.apspdcl.in ఓపెన్ చేసి, అందులో పే బిల్ ఆప్షన్ ఎంపిక చేసుకోవాలి. తర్వాత డిటిజల్ పేమెంట్ గేట్‌వే కింద మూడు ఆప్షన్లు బిల్ డెస్క్, ఏపీ ఆన్‌లైన్, టీపే (ట్రాన్సాక్షన్ అస్యూర్డ్) కనిపిస్తాయి. వీటిల్లో మీకు నచ్చిన పేమెంట్ గేట్‌వేను ఎంపిక చేసుకోవచ్చు. తర్వాత మీ మీటరు నెంబరు ఎంటర్ చేసి ఫోన్ పే, గూగుల్ పే తదితర థర్డ్ పార్టీ యాప్‌లతోపాటు క్రెడిట్, డెబిట్ కార్డుల ద్వారా కూడా బిల్లు కట్టేయవచ్చు.

మీఫోన్‌లో ఎస్పీడీసీఎల్ కన్జూమర్ యాప్‌ని డౌన్‌లోడ్ చేసుకోవాలి. రిజిస్టర్ మొబైల్ నెంబరు ద్వారా లింకైన విద్యుత్ మీటర్ నెంబరును రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అందులోని 'బిల్ పే' ఆప్షన్ ద్వారా మీ ఫోన్‌లో ఉండే ఫోన్ పే, గూగుల్ పే తదితర థర్డ్ పార్టీ యాప్‌లతోపాటు క్రెడిట్, డెబిట్ కార్డుల ద్వారా కూడా బిల్లు కట్టేయవచ్చు. ఈ యాప్‌లోనే పేమెంట్ హిస్టరీ, ఏ నెలలో ఎన్ని యూనిట్లు వినియోగించిందీ తెలిసిపోతుంది. అదేవిధంగా కొత్త మీటరు కనెక్షన్ కావాలన్నా ఈ యాప్‌లోనుంచే దరఖాస్తు చేసుకోవచ్చు.

తిరుపతిలో డీజీపీ



తిరుపతి(నేరవిభాగం), జూలై 22: డీజీపీ ద్వారకా తిరుమలరావు తిరుపతి వచ్చారు. మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం రాత్రి జరిగిన అగ్నిప్రమాద ఘటనపై విచారణ నిమిత్తం వచ్చిన ఆయన అక్కడినుంచి సోమవారం రాత్రి కారులో బయలుదేరి తిరుపతికి చేరుకున్నారు. పోలీసు అతిథి గృహంలో బస చేశారు.

గణిత ప్రజ్ఞాధారణతో విద్యార్థుల్లో నూతన ఆలోచనలు



బాలగణిత అవధానులుగా వ్యవహరించిన విద్యార్థులకు బహుమతులిస్తున్న నిర్వాహకులు

గంగాధరనెల్లూరు, జూలై 22: గణిత ప్రజ్ఞాధారణ కార్యక్రమం విద్యార్థుల్లో నూతన ఆలోచనలను రేకెత్తించిందని ఎంఈవోలు కాణిపాకం ఆంజినేయులుశెట్టి, గుణశేఖర్‌రెడ్డిలు అన్నారు. ఆంధ్రప్రదేశ్ మ్యాథ్స్ ఫోరంలో భాగంగా మండలంలోని వేపంజేరి హైస్కూల్లో సోమవారం ఏపీ జనవిజ్ఞాన వేదిక విద్యా విభాగం కన్వీనర్, గణిత అవధాని అరుణ్ శివప్రసాద్ ఆధ్వర్యంలో మంగళపల్లె హైస్కూల్లో సోమవారం గణిత ప్రజ్ఞాధారణ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు హేమ, లహరి, పునిత్‌సాయిలు 200 సంఖ్యలను ఏ క్రమంలో అడిగినా సమాధానాలు అవలీలగా ధారణ చేశారు. మ్యాథ్స్ టీచర్లు వేర్వేరుగా వేసిన ప్రశ్నలకు తడుముకోకుండా సమాధానాలు చెప్పి అందర్నీ ఆశ్చర్యంలో ముంచెత్తారు. అనంతరం బాలగణిత ప్రజ్ఞాధారణులుగా వ్యవహరించిన వారితో పాటు గణిత అవధాని అరుణ్‌శివప్రసాద్, మ్యాథ్స్ టీచర్లను దేశి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు జయంతి సన్మానించారు. ఏపీ మ్యాథ్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు చంద్రమనాయుడు, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి, రాష్ట్ర టెక్నికల్ కమిటీ సభ్యురాలు స్వప్న, జిల్లా కోశాధికారి మనోహర్, హైస్కూల్ హెచ్‌ఎం మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన అర్జీలు పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ



సమావేశంలో అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, జూలై 22: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా గత నెల 25, 26 తేదీల్లో కుప్పం పర్యటనలో సీఎం చంద్రబాబుకు అందిన అర్జీల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో అర్జీల పరిష్కారంపై శాఖల వారీగా కలెక్టర్ సమీక్షించారు. రెవెన్యూ అర్జీలను పరిష్కరిస్తున్నట్లు ఆర్డీవోలు, తహసీల్దార్లు చెప్పారు. పంచాయతీరాజ్ శాఖకు రోడ్లు, ఆలయాల నిర్మాణాలకు అధిక సంఖ్యలో అర్జీలు అందాయని సంబంధిత అధికారి కలెక్టర్‌కు వివరించారు. డీఆర్వో పుల్లయ్య, డ్వామా పీడీ రాజశేఖర్ పాల్గొన్నారు.

జిల్లా రచయితల సంఘం నూతన కమిటీ

చిత్తూరు కల్చరల్, జూలై 22: జిల్లా రచయితల సంఘం నూతన కమిటీని ఏర్పాటు చేశారు. సోమవారం సుందరయ్యవీధి డాక్టర్ రామలక్ష్మి నర్సింగ్‌హోంలో కట్టమంచి బాలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కమిటీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధ్యక్షుడిగా గిరిధరన్, ఉపాధ్యక్షులుగా ఎడ్ల బాలకృష్ణారెడ్డి, ఎంవీ.శ్రీధర్ రెడ్డి, అరుణకుమారి, కార్యవర్గ సభ్యులుగా డాక్టర్ రోజాప్రియ, గంటా మోహన్, బి.మునిరత్నం రెడ్డి, సలహా సంఘ సభ్యులుగా వి.హరినాయుడు, బి. మునుస్వామి, మొగిలయ్యశెట్టి, హసీనాబేగం, శ్యామలాదేవి, కార్యదర్శిగా సహదేవనాయుడు, కోశాధికారిగా బాబిలను నియమించారు. నూతన కమిటీని పలువురు అభినందించారు.

ఏపీ పునర్నిర్మాణంలో కేంద్రం భాగస్వామ్యం కావాలి

పార్లమెంటులో ఎంపీ దగ్గుమళ్ల



చిత్తూరు సిటీ, జూలై 22: ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణంలో కేంద్ర ప్రభుత్వం భాగస్వామ్యం కావాలని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు కోరారు. సోమవారం తొలి విడత లోక్‌సభ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా లోక్ సభలో ప్రథమంగా జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో స్పీకర్ ఓం బిర్లా ప్రశ్నోత్తరాల సమయంలో చిత్తూరు ఎంపీకి మాట్లాడే అవకాశం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ పాలనలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో వెనుకబడిందన్నారు. రాష్ట్రాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్రప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించి రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని కోరారు.

అధికార బలంలో లాక్కున్న ఇంటి స్థలాన్ని ఇప్పించండి

చిత్తూరు, జూలై 22: కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల్లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ శ్రీనివాసులు, ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ మణికంఠ వినతిపత్రాలను స్వీకరించారు. మొత్తం 182 అర్జీలు అందాయి. వాటిలో రెవెన్యూకు సంబంధించి 155, పోలీసుశాఖకు 5, మిగిలిన శాఖలకు 22 అర్జీలున్నాయి. ఈకార్యక్రమంలో డీఆర్వో పుల్లయ్య, డ్వామాపీడీ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. కాగా, అధికారుల దృష్టికి వచ్చిన అర్జీల్లో కొన్ని..

● తమ ఇంటి స్థలాన్ని ఆక్రమించుకుని రేకుల షెడ్డు వేసుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని యాదమరి మండలం వరదరాజులపల్లెకు చెందిన హేమలత కోరారు. సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి వినతిపత్రాన్ని ఇచ్చారు. గత 70 ఏళ్లుగా సర్వే నెంబరులో 216-1లో 3 సెంట్ల ఇంటి స్థలం తన మామ గోపాల్ పేరు మీద ఉండేదని, ఆయన చనిపోయిన తరువాత తనపేరు మీద 1.50 సెంట్లు, మరో 1.50 సెంట్లు తన అత్త శాంతమ్మ పేరు మీద రాసుకున్నామన్నారు. ఈ స్థలాన్ని కన్నయ్య నుంచి కొనుగోలు చేసినట్టు వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు తప్పుడు పట్టాను సృష్టించి పోలీసులు, రెవెన్యూ అధికారుల అండతో సురేష్, జయరామన్, ధనంజయ, వెంకటేశ్ కలిసి ఉన్న కాలనీ ఇంటికి కూలదోసి రేకుల షెడ్డు వేశారని ఆరోపించారు. ఇంటి స్థల విషయంపై కోర్టులో కేసు నడుస్తోందన్నారు. గతంలో అధికార పార్టీ

● కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు బాధితురాలి మొర

నేతల అండదండలతో తమపై దౌర్జన్యం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులు రికార్డులను పరిశీలించి తమకు న్యాయం చేయాలని కోరారు.

● రోడ్డుకు ఇరువైపులా చెట్ల కొమ్మలు, ముళ్ల చెట్లు రోడ్డుకు అడ్డంగా రావడంతో రోడ్డు కనపడకపోవడంతో పాటు ఎదురుగా వచ్చే వాహనాలు కూడా కనపడటం లేదని పూతలపట్టు మండలం ఎగువ, దిగువ కండ్రిగ గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. గతంలో ముత్తిరేవులు నుంచి షైనగుండ్లపల్లె ద్వారా కాణిపాకం రోడ్డు కలిసే సత్రం వరకు రోడ్డును వేశారన్నారు. ఈ రోడ్డుకు ఇరువైపులా వ్యవసాయ పొలాలు ఉన్నాయన్నారు. పొలాల్లో నాటిన చెట్ల కొమ్మలు రోడ్డుపైకి రావడంతో ఆర్టీసీ బస్సులకు అడ్డంగా వచ్చిందన్నారు. అలాగే రోడ్డు పక్కలా ముళ్ల చెట్లు కూడా పెరిగి రోడ్డు కనపడకుండా ఉందన్నారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉందన్నారు. అధికారులు స్పందించి వాహనదారుల ప్రయాణాలకు ఇబ్బందులు లేకుండా చేయాలని కోరారు.

● టీడీపీ నేతలపై నమోదైన తప్పుడు కేసులకు తక్షణం విముక్తి కల్పించాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ విజ్ఞప్తి చేశారు.2019 నుంచి 24 వరకు అప్పటి పోలీసు అధికారులు పథకం ప్రకారం వైసీపీ నేతల ఒత్తిడి మేరకు టీడీపీ నేతలు, కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయించి వేధింపులకు గురి చేశారన్నారు. మరికొంత పోలీసు అధికారులైతే ఉద్దేశ్యపూర్వకంగా కేసులు నమోదు చేసి తమ కుటుంబాలను కూడా మానసిక వేధింపులకు గురి చేశారన్నారు. పూతలపట్టు, చిత్తూరు, పుంగనూరు ప్రాంతాల్లో అయితే కుప్పలు తెప్పలుగా 307 కేసులు పెట్టారన్నారు. పూర్తి స్థాయిలో విచారించి అక్రమంగా పెట్టిన కేసుల నుంచి రక్షణ కల్పించాలని ఆయన కోరారు.



బాధితుల సమస్యలను వింటున్న కలెక్టర్ సుమిత్‌కుమార్



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులు

● ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్ ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఆ సంఘ గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు, అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, భారతి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో 18 నెలలుగా జీతాలు ఇవ్వకపోగా కొత్తగా వచ్చిన ప్రభుత్వం రెండు నెలల జీతాన్ని మాత్రమే ఇచ్చిందన్నారు. ఉద్యోగులకు ఈఎస్ఐ, పీఎఫ్‌ను అమలు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సమాన పనికి సమాన వేతనాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న 16 నెలల వేతనాలను కూడా విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ నేతలు హనుమంతు, నీలకంఠారెడ్డి, లక్ష్మీదేవి, ఓబులేశు తదితరులు పాల్గొన్నారు.

● ఎస్పీ కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో 39 మంది బాధితులు పాల్గొని నేరుగా ఎస్పీ మణికంఠకు తమ సమస్యలను విన్నవించుకున్నారు. బాధితుల సమస్యలను విన్న ఆయన పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సోమవారం నాటి కార్యక్రమంలో భూ తగాదాల కింద 16, డబ్బు తగాదాలు 8, కుటుంబ తగాదాలు 5, ఆస్తి తగాదాలు 4, వేధింపులు 3, మిస్సింగ్ 2, ఇంటి తగాదా 1 వంతున అర్జీలు అందాయి.

బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ



శోభాయమానంగా ప్రసన్న వేంకటేశ్వరుడి పుష్పయాగం



వడమాలపేట, జూలై 22: అప్పలాయగుంటలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పుష్పయాగం శోభాయమానంగా జరిగింది. ఆలయంలో గత నెల 17నుంచి 25 వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరిగిన విషయం విదితమే. బ్రహ్మోత్సవాల్లో అర్చక పరిచారికలు, అధికారులు, భక్తుల వల్ల తెలిసీ తెలియక లోపాలు జరిగి ఉంటే ప్రాయశ్చిత్తంగా పుష్పయాగం నిర్వహించడం ఆనవాయితీ. ఉదయం ఉభయదేవేరులతో ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు ఆధ్వర్యంలో అర్చకుల వేద మంత్రోత్సారణలు, మంగళవాయిద్యాల నడుమ పుష్పయాగం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తులసి, చామంతి, గన్నేరు. మొగలి, సంపంగి రోజా, కలువలు వంటి 11 రకాల పుష్పాలు ఐదు రకాల పత్రాలతో స్వామి, అమ్మవార్లకు పుష్పయాగం నిర్వహించారు. భక్తుల గోవిందనామ స్మరణల నడుమ మహామంగళ హారుతులిచ్చారు. అనంతరం పద్మావతీ ఆండాల్ సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామిని మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులు నారికేళ, కర్పూర నీరజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఎనర్జీ ఆడిట్ జీఎంగా కృష్ణారెడ్డి

తిరుపతి(ఆటోనగర్), జూలై 22: ఆంధ్రప్రదేశ్ సదరన్ డిస్కం ఎనర్జీ ఆడిట్ జనరల్ మేనేజరుగా ఆశాఖ కార్యాలయంలో సోమవారం ఎం.కృష్ణారెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఆ స్థానంలో వున్న వెంకట సుబ్బయ్య పదవీ విరమణ చేశారు. దీంతో ఇటీవల తిరుపతి సర్కిల్ ఎస్ఈగా రిలీవ్ అయిన కృష్ణారెడ్డి జీఎంగా బాధ్యతలు తీసుకున్నారు. కృష్ణారెడ్డికి కార్పొరేట్ కార్యాలయ అధికారులు అయూబ్ ఖాన్, ఈఈలు వాసుదేవ రెడ్డి, దామోదరం, శ్రీనివాసమూర్తి, డీఈఈలు జయప్రకాష్, విష్ణువర్ధన్, మునిప్రసాద్, ప్రభాకర్, ఏఈలు గణపతి, వివేకానంద తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.



కృష్ణారెడ్డికి అభినందనలు తెలుపుతున్న అధికారులు, ఉద్యోగులు

తిరుమలేశుడి సేవలో సుజయనిధితీర్థ స్వామి

తిరుమల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): శ్రీపాదరాజ మఠాధిపతి సుజయనిధి తీర్థ స్వామి సోమవారం పెద్దమర్యాదతో తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామ సమయంలో ఆలయం ముందున్న అఖిలాండం వద్దకు చేరుకున్న స్వామికి టీటీడీ ఈవో శ్యామలరావు, జేఈవో వీరబ్రహ్మం, అర్చక బృందం వెళ్లి శఠగోపం సమర్పించి ఇస్తికాఫల్(ఆలయ మర్యాద) స్వాగతం పలికారు. శిష్యబృందంతో సుజయనిధితీర్థ స్వామి ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని, తర్వాత మూలమూర్తిని దర్శించుకున్నారు. అదేవిధంగా శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్ శివప్రతాప్‌శుక్లా, సినీనటుడు రాంప్రసాద్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.



సుజయనిధితీర్థ స్వామి - శివప్రతాప్ శుక్లా

గురుకులంలో కలకలం

విద్యార్థిని కన్పించలేదని వెతుకులాట

హాస్టల్ గదిలోనే వున్నట్లు గుర్తింపు

సూళ్లూరుపేట, జూలై 22 : ఓ విద్యార్థిని అదృశ్యమై కొద్ది గంటలకే నిద్రిస్తూ కనిపించిన వైనం కలకలం రేపింది. సూళ్లూరుపేటలోని అంబేడ్కర్ గురుకులంలో పదో తరగతి విద్యార్థిని అదృశమైనట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గురు ప్రసూన సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉదయం 8 గంటలకు సదరు విద్యార్థిని క్లాసు ప్రారంభంలో కనిపించింది. 10.50గంటలకు విరామ సమయంలో వెళ్లిన విద్యార్థిని 11 గంటలకు తరగతి గదిలో కనిపించలేదు. సిబ్బంది ప్రిన్సిపాల్‌కు చెప్పడంతో పాఠశాలలో విస్తృతంగా గాలించారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు బాలిక స్వగ్రామంలోని తల్లిదండ్రులకు తెలియజేశారు. విద్యార్థులెవరూ బయటకు వెళ్లలేదని గేట్ వాచ్‌మన్ పోలీసులకు చెప్పాడు. అనుమానంతో హాస్టల్ గదులను పరిశీలించారు. ఆ విద్యార్థిని ఓ గదిలో నిద్రిస్తున్నట్లు గుర్తించారు. బాలికను విచారించారు. సాంఘిక సంక్షేమ గురుకుల డీసీవో పద్మజ రాత్రి పాఠశాలను తనిఖీ చేశారు.

డిప్యూటీ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



రామసముద్రం తహసీల్దార్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు చేస్తున్న డిప్యూటీ కలెక్టర్ రమాదేవి

రామసముద్రం, జూలై 22: మదనపల్లె డిప్యూటీ కలెక్టర్ రమాదేవి సోమవారం సాయంత్రం రామసముద్రం తహసీల్దార్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం రాత్రి అగ్నిప్రమాదం జరిగి పలు ఫైళ్లు అగ్నికి ఆహుతి అయిన నేపథ్యంలో డిప్యూటీ కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ తనిఖీలో 2022 ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు మండలం నుంచి మదనపల్లె ఆర్డీవో కార్యాలయానికి పంపిన పలు ఫైళ్లను తనిఖీ చేసినట్లు తెలుస్తోంది. ఇందులో ఆర్‌టీఏ, అసైన్‌మెంట్, 22ఎ, కోర్టు కేసులు, ఇంటి స్థలాలు, లోకాయుక్త, వెబ్‌ల్యాండ్స్, మ్యుటేషన్ తదితర 25ఫైల్స్‌కు సంబంధించి తనిఖీలు చేసినట్లు సమాచారం. ఈ తనిఖీలలో తహసీల్దార్ శ్రీనివాసులు, డీటీ శ్రీనివాస్‌రావు, పలువురు వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

రెవెన్యూ రికార్డుల పరిశీలనకు ప్రత్యేక అధికారి



బి.కొత్తకోట రెవిన్యూ సిబ్బందితో సమావేశమైన ప్రత్యేక అధికారి లీలారాణి

బి.కొత్తకోట, జూలై22: బి.కొత్తకోట మండల రెవెన్యూ రికార్డుల పరిశీలన, భద్రతా పర్యవేక్షణ కోసం ప్రత్యేక అధికారిణి లీలారాణిని ఉన్నతాధికారులు నియమించారు. మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాల యంలో అత్యంత ముఖ్యమైన రెవెన్యూ ఫైళ్లు అనుమానాస్పద స్థితిలో అగ్నికి ఆహుతి అయిన నేపథ్యంలో ఎంపిక చేసిన మండలాలకు ఓ ప్రత్యేక అధికారిణి నియమించి అసైన్డ్ భూములు, రీసర్వే రికార్డుల భద్రతపై సమీక్షించాలని ప్రభుత్వం భావించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో బికొత్తకోట మండలానికి నియమితులైన లీలారాణి సోమవారం రాత్రి బి.కొత్తకోటకు చేరుకొని తహశీల్దార్ కార్యాలయంలో రికార్డుగదిని పరిశీలించారు. తహశీల్దార్ పుణ్యవతి, డీటీ అన్సారీ, అందుబాటులో వున్న సిబ్బందితో సమావేశమై రికార్డుల భద్రతపై సమీక్షించారు. ఈమె నెల్లూరు జిల్లా సోమశిలప్రాజెక్టు డిప్యూటీ కలెక్టర్‌గా వ్యవమరిస్తున్నారు.

హత్యాయత్నం కేసులో భార్యాభర్తలకు శిక్ష ఖరారు

● 3సంవత్సరాల 3నెలల పాటు శిక్ష..జరిమానా విధింపు

ములకలచెరువు, జూలై 22: హత్యాయత్నం కేసులో భార్యభర్తలకు శిక్ష ఖరారు చేస్తూ మదనపల్లె పీఎస్‌జే కోర్టు జడ్జి వెంకటేశ్వర్లు నాయక్ సోమవారం తీర్పు వెలువరించారు. వివరాల్లోకి వెళితే...ములకలచెరువు మండలం పెద్దపాళ్యం పంచాయతీ మలిగివారిపల్లెకు చెందిన దామోదరం బావమరిదిపై భూ తగాదా విషయమై నెటవరానిపల్లెకు చెందిన ముత్తర జయరాం, అతని భార్య రత్నమ్మ కళ్లలో కారంపొడి చల్లి కొడవలితో నరికారు. 2018 జూన్ 16వ తేదీన జరిగిన ఈ ఘటనకు సంబంధించి అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన పల్లె పీఎస్‌జే కోర్టు నేరం రుజువు కావడంతో శిక్ష విధించింది. ముత్తర జయరాం, అతని భార్య రత్నమ్మలకు 3 సంవత్సరాల 3నెలలు పాటు శిక్ష విధిస్తూ జడ్జి వెంకటేశ్వర్లు నాయక్ తీర్పు చెప్పారు. అలాగే ఒకొక్కరికి రూ.1500 చొప్పున జరిమానా విధించారు. ఈ కేసులో మరో నిందితురాలైన జయరాం కుమార్తె మైనర్ కావడంతో చిత్తూరు కోర్టులో కేసు నడుస్తోందని పోలీసులు తెలిపారు.

ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్యాయత్నం..ఒకరు మృతి

రామసముద్రం, జూలై 22: రామసముద్రం మం డలంలో రెండు వేర్వేరు కుటుంబాకులకు చెందిన ఇద్దరు వ్యక్తులు కుటుంబ కలహాలతో ఆత్మహత్యా యత్నం చేయగా ఒకరు మృతి చెందారు. ఇంకొకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. ఎలవానెల్లూరు పంచాయతీ పైగడ్డకు చెంది న జిల్లా శ్రీనివాసులు సోమవారం పురుగుల మందు తాగి ఆత్మ హత్యా యత్నానికి పాల్పడ్డాడు. ఉదయం ఆవులను మేపేందుకు వెళ్లిన శ్రీనివాసులు అపస్మారక స్థితిలో పడి ఉండటం చూసిన ఆయన భార్య వెంటనే రామసముద్రం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యంకోసం పుంగనూరుకు తర లించ గా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అలాగే మండలం లోని నరసాపురం గ్రామానికి చెందిన వెంకటరమణ భార్య లలిత కుటుంబ కలహాలతో సోమవారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను మదనపల్లె ఆస్పత్రికి తరలించారు. ఆమె ఆరోగ్యం నిలక డగా ఉన్నట్లు సమాచారం. కాగా శ్రీనివాసులు మృతిపై పోలీసు లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ రైతు మృతి

● అప్పుల బాధతోనని కుటుంబీకుల ఫిర్యాదు



చంద్రశేఖర్‌రెడ్డి (ఫైల్)

ములకలచెరువు, జూలై 22: ములకలచెరువు మండలం గూడుపల్లె పంచాయతీ కనుగొండవారిపల్లెలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ రైతు సోమవారం మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు...గ్రామానికి చెందిన రైతు చంద్రశేఖర్‌రెడ్డి వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇతనికి భార్య నిర్మల, కుమార్తె గౌతమి, కుమారుడు ఉమాశంకర్ రెడ్డిలు ఉన్నారు. వ్యవసాయం గిట్టుబాటు కాకపోవడంతో అప్పులు చేసి వ్యవసాయ చేశాడు. ఈ క్రమంలో పెళ్లీడుకొచ్చిన కూతురుకి పెళ్లి చేయాలని, పంటల కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో అర్థంకాక మనస్థాపం చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం 108 అంబులెన్సులో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈమేరకు కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహానికి మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి అంత్యక్రియల నిమిత్తం స్వగ్రామానికి తరలించారు. రైతు మృతితో గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

రికార్డులు దహనం చేసిన వారిని శిక్షించాలి



సబ్‌కలెక్టరేట్ వద్ద నిరసన అనంతరం డీజీపీకి వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నేతలు



మాట్లాడుతున్న టీడీపీ నేత ఆర్జే వెంకటేష్

మదనపల్లె అర్బన్, జూలై22: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో భూ రికార్డులు దహనం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని టీడీపీ, కాంగ్రెస్, వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. ఆ మేరకు సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట వేర్వేరుగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల నాయకులు మాట్లాడుతూ సబ్ కలెక్టర్ కార్యాలయంలో డీకేటీ, 22ఎ రికార్డులు నిర్వహించే క్యాబ్ మాత్రమే ఎలా కాలిపోతుందని ప్రశ్నించారు. ఆదివారం రాత్రి 11 గంటలపైన సంఘటన జరిగితే పక్కనే ఉన్న ఫైర్ స్టేషన్‌కు, పోలీసులకు సమాచారం లేటుగా అందించడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నట్లు వారు పేర్కొన్నారు. భూములకు సంబంధించిన కేసు విచారణలో సోమవారం ఉండడం, కొత్త సబ్ కలెక్టర్ బాధ్యతలు తీసుకోక మునుపే ఇలా జరగడం, శనివారం ఆర్డీవో గతంలో పనిచేసిన మురళి శనివారం కార్యాలయానికి రావడం చాలా అనుమానాలకు తావు ఇస్తున్నాయన్నారు. కేవలం తంబళ్లపల్లె, పుంగనూరుకు సంబంధించిన అక్రమ రికార్డులు లేకుండా చేయడానికి నిరుపేదల భూ రికార్డులు నాశనం చేశారని వారు ఆరోపించారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిధున్‌రెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిల పాలనలో పేదలు, ప్రభుత్వ భూములు, 22ఎ కింద ఉన్న భూములు 3 వేల ఎకరాల వరకు అన్యాక్రాంతం చేసిన భాగోతం బయట పడుతుందనే నెపంతో రికార్డులు కాల్చి బూడిద చేయించారని ఆరోపించారు. ఆదివారం 11 గంటల వరకు రెవెన్యూ అధికారులకు ఏమి పని ఉంటుందని వారు ప్రశ్నించారు. దీనికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆర్జే వెంకటేష్, రాటకొండ మధుబాబు, మైనార్టీ నాయకులు ఎస్ఏ మస్తాన్, కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ నాయకులు రెడ్డిసాహెబ్, మహబూబ్‌పీర్, సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, సీపీఐ నాయకులు కృష్ణప్ప, మురళి, సాంబశివ, ఎంఆర్పీఎస్ జాతీయ నాయకుడు నరేంద్రబాబు, జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు మణిశంకర్ పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదుతో జనసేన పార్టీలో సముచిత స్థానం



జనసేన పార్టీ సభ్యత్వ నమోదు చేస్తున్న నాయకులు

నిమ్మనపల్లి, జూలై 22: సభ్యత్వ నమోదుతో జనసేన పార్టీలో సముచిత స్థానం కల్పించబడుతుందని జనసేన మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం స్థానిక పంచాయతిలో జనసేన కార్యకర్తల నుంచి పార్టీ సభ్యత్వాన్ని నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ తరపున సభ్యత్వాలను నమోదులో భాగంగా ఇప్పటి వరకు దాదాపు 100 సభ్యత్వాలు ప్రజలు తీసుకొన్నట్లు తెలిపారు. సభ్యత్వం తీసుకోవడం వలన ప్రమాదవశాత్తు సభ్యత్వం కలిగిన వ్యక్తి మరణిస్తే రూ.5లక్షల వరకు బీమా పాలసీ, ప్రమాదంలో గాయపడిన వారికి రూ.50వేలను జనసేన పార్టీ ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు భరత్, శవకుమార్, నవీన్, సాయి, గోపాల్, హరి, సుధాకర్, హర్షవర్థన్, వెంకటరమణ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై పాడిరైతు అప్రమత్తంగా ఉండాలి

నిమ్మనపల్లి, జూలై 22: సీజనల్ వ్యాధులపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి సురేష్ పేర్కొన్నారు. సోమవారం కొండయ్యగారిపల్లి పంచాయతి వెంకోజిగారిపల్లిలో పాడి రైతులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి ఆవులకు కుళ్లిన దాణా, గడ్డి వేయడం వలన అవి జీర్ణం కాక ఫంగస్ ఏర్పడి అనారోగ్యం చెంది మరణిస్తాయన్నారు. ముఖ్యంగా పాడి రైతులు బాగా గడ్డిని ఎండబెట్టి, నాణ్యమై పశులదాణా, కలుషితం కాని పచ్చగడ్డిని వేయాలన్నారు. అలాగే 9టన్నుల మొక్కజొన్న విత్తనాలు వచ్చాయని సంబంధింత పశుకేంద్రాలలో రైతులు 25కేజీల మొక్కజొన్న బ్యాగును సబ్సిడీ రూపంలో రూ.17కే పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో విశేషపూజలు

పెద్దతిప్పసముద్రం జూలై 22 : మండల కేంద్రమైన పీటీఎంలో వెలసిన పార్వతీ సమేత విరూపాక్షేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సనగరం పట్టాభిరామయ్య ఆధ్వర్యంలో విశేషపూజలు నిర్వహించారు. ఉదయం ఆలయంలోని శివుడికి పంచామృతాభిషేకం, ఏకవార రుద్రాభిషేకంను నిర్వహించారు. ఆలయంలో స్వామి వారిని సుందరంగా అలంకరించి వేదపండితులచే పూజలు నిర్వహించారు. స్వామి వారికి పంచహారతి, సప్తహారతి, నక్షత్రహారతి, మహామంగళారతి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో పీటీఎంతో పాటు సమీప గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

సెల్‌ఫోన్ల నిందితులెక్కడ...?! పట్టించారు...వదిలేశారు

●పోలీసుల తీరుపై ప్రజల ఆందోళన

గుర్రంకొండ, జూలై 22:గుర్రంకొండ సంతలో కొన్ని నెలలుగా కొందరు ముఠా సభ్యులు సెల్‌ఫోన్లను చోరీలు చేస్తున్నారు. దీంతో సంతకు వచ్చే ప్రజలు, వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో కొన్ని నెలలుగా పదుల సంఖ్యలో సెల్ ఫోన్లను ప్రజలు పోగొట్టుకున్నారు. ఈ నేపథ్యంలో సంతకు వచ్చే ప్రజలు, యువకులు సెల్‌ఫోన్ నిందితుల కోసం కాపుకాచి పట్టుకొని పోలీసులకు అప్పగించారు. పోలీసులకు అప్పగించిన నిందితులను పట్టించిన గంటల వ్యవధిలోనే పంపేయడంతో ప్రజలు, వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. దీంతో గుర్రంకొండ పోలీసుల తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నెల 19వ తేదీన సంతలో సెల్ ఫోన్లను చోరీ చేయడానికి ప్రయత్నిస్తున్న అనంతపురంకు చెందిన ఇద్దరు నిందితులను కొందరు యువకులు పట్టుకుని దేహశుద్ధి చేశారు. అనంతరం నిందితులను స్థానిక యువకులు పోలీసులకు అప్పగించారు. దీంతో పోలీసులు నిందితులను విచారణ చేయకుండానే రాత్రికి రాత్రే పంపిచేసినట్లు తెలిసింది. అలాగే ఈ నెల 5వ తేదీన ఓ బాలుడు సెల్‌ఫోన్‌ను చోరీ చేస్తుండగా స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ బాల నిందితున్ని కూడా పూర్తి స్థాయిలో విచారణ చేయకుండా వదిలేశారు. ఇలా గుర్రంకొండ పోలీసులు నిందితులను ఇష్టానుసారంగా వదిలేస్తున్న జిల్లా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు చర్చించుకొంటున్నారు. ఈ విషయమై ఎస్ఐ నాగార్జున్‌రెడ్డి వివరణ కోరగా చోరీలకు పాల్పడుతున్న నిందితులు చాలా వరకు మైనర్లు కావడంతో విచారణకు ఇబ్బందిగా ఉందన్నారు. అలాగే అనంతపురంకు చెందిన నిందితులను స్టేషన్‌కు పిలిపించి విచారిస్తామన్నారు.

తుమ్మరకుంటలో పీర్ల పండుగ

పెద్దతిప్పసముద్రం జూలై 22 : మండలంలోని తుమ్మరకుంట గ్రామంలో ఈనెల 24 నుంచి 30వ తేదీ వరకు పీర్ల పండుగ ఘనంగా నిర్వహించనున్నట్లు తుమ్మరకుంట గ్రామస్థులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుమ్మరకుంటలో శనివారం సాయంత్రం పీర్ల పండుగను నిర్వహించేందుకు గ్రామంలో గుద్దిలి నిర్వహించి గ్రామంలో పీర్లను కొలువుదీర్చామని, మొదట తుమ్మరకుంట గ్రామంలోని తుమ్మరకుంటవారిపల్లెలో పీర్ల ఊరేగింపుఉంటుందన్నారు. 25న సామాడపల్లె, బొమ్మిరెడ్డిపల్లె, గజ్జలవారిపల్లెలో. 26న బండమీదపల్లె (ఎగువ, దిగువ), బురదవారిపల్లెలో ఊరేగింపు, 27న రాత్రి తుమ్మరకుంటలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. 28న పీర్ల జల్లి కార్యక్రమం నిర్వహిస్తారన్నారు.

ఫైళ్ల కాల్చివేతలో వైసీపీ కుట్ర

● రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు



మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రాజు

రాయచోటి టౌన్, జూలై 22 : మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన అగ్నిప్రమాదం వెనుక వైసీపీ కుట్ర దాగి ఉందని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నారు. సోమవారం ఆయన రాయచోటి పట్టణంలో మీడియాతో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయం పరిధిలో జరిగిన భూఅక్రమాలతో పాటు వైసీపీ పెద్దలు ఆక్రమించిన పేదల భూములను తిరిగి వారికి స్వాధీనం చేసే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఒక నిజాయితీ గల ఐఏఎస్ అధికారిని మదనపల్లె సబ్ కలెక్టర్‌గా నియమించిందన్నారు. మరికొన్ని గంటల్లో మదనపల్లె సబ్ కలెక్టర్‌గా ఐఏఎస్ అధికారి మేఘస్వరూప్ బాధ్యతలు స్వీకరించనుండటంతో తమ అవినీతి, అక్రమాలు ఎక్కడ బయట పడతాయోనన్న భయంతో వైసీపీ పెద్దలు కుట్ర పన్ని సబ్ కార్యాలయంలోని రికార్డులను కాల్చివేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. కార్యాలయంలో ఎటువంటి షార్ట్ సర్క్యూట్ జరగలేదని, కేవలం గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అక్రమాలకు సంబంధించిన రికార్డులు ఉన్న కొత్త భవనంలోనే ఈ అగ్నిప్రమాదం జరగడం వెనుక పెద్దిరెడ్డి, అతడి అనుచరుల హస్తం ఉందన్న అనుమానులు సర్వత్రా ఉన్నాయన్నారు. దీనిపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

నేటి నుంచి సంచార ఆధార్ కేంద్రాలు

తంబళ్లపల్లె, జూలై 22: తంబళ్లపల్లె మండలంలో ఈ నెల 23 నుంచి 27 వరకు సంచార ఆధార్ కేంద్రాలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో క్రిష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. 23, 24 తేదీలలో కొటాల సచివాలయంలో, 23 నుంచి 25 వరకు కన్నెమడుగు సచివాలయంలో, 25 నుంచి 27 వరకు తంబళ్లపల్లె-1 సచివాలయంలో, 26, 27 తేదీలలో రేణుమాకులపల్లె సచివాలయంలో సంచార ఆధార్ కేంద్రాలు ఉంటాయన్నారు. ఈ ఆధార్ కేంద్రాలలో 0 నుంచి 5 సంవత్సరాల లోపు చిన్నారులకు బాలాధర్ చేస్తారన్నారు. అదేవిధంగా ఆధార్ కార్డు అప్డేట్, బయోమెట్రిక్ అప్డేషన్, నూతన ఆధార్ నమోదు, ఆధార్ నందు పేరు, వయస్సు, ఫోను నెంబరు మార్పులు వంటి సేవలు ఉంటాయన్నారు. విద్యార్థులు, ప్రజలు, ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హెల్మెట్ ప్రాణాపాయం నుంచి కాపాడుతుంది



హెల్మెట్‌లు ధరించి బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు

మదనపల్లె టౌన్, జూలై 22: ద్విచక్రవాహనదారులు డ్రైవింగ్ సమయంలో తలకు హెల్మెట్ ధరించడం ప్రాణాపాయం నుంచి కాపాడుతుందని ప్రిన్సిపాల్ ఆర్.కృష్ణవేణి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఏపీ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాలతో విద్యార్థినులతో అవగాహన బైక్ ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్ ఎంత అవసరమో ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాసులు, ఖాజావలి, జ్యోతి, మోహనవల్లి, వనజ పాల్గొన్నారు.

మాలమహానాడు అధికార ప్రతినిధిగా హరి

కలికిరి, జూలై 22: మాలమహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధిగా కలికిరికి చెందిన వడ్డి హరి నియమితులయ్యారు. తిరుపతిలో సోమవారం జరిగిన మాలమహానాడు రాయలసీమ జిల్లాల కార్యవర్గ సమావేశంలో ఆయనను అధికార ప్రతినిధిగా ఎన్నుకున్నారు. మాలమహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ యమలా సుదర్శనం, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ స్వర్ణ వెంకయ్య చేతుల మీదుగా హరి తన నియామక పత్రం అందుకున్నారు. అదే విధంగా మాల స్టూడెంట్స్ ఫెడరేషన్(ఎంఎస్ఎఫ్) రాయలసీమ జిల్లాల అధ్యక్షులుగా కలికిరి మండలం అద్దవారిపల్లెకు చెందిన మాలతోటి నరేష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారిద్దరూ పాత్రికేయులతో మాట్లాడుతూ తమకు పదవులు అప్పగించిన జాతీయ, రాష్ట్ర నాయకుల నమ్మకాన్ని వమ్ము కానివ్వకుండా పనిచేస్తామన్నారు. రాష్ట్ర అధికార ప్రతినిధిగా, రాయలసీమ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన వారిద్దరిని స్థానికంగా పలువురు అభినందించారు.

దాడిపై కేసు నమోదు

కలకడ, జూలై 22:మండలంలోని బాటవారిపల్లె పంచాయతీ పెర్నినేనివారిపల్లెలో మహిళపై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ హరిబాబు తెలిపారు. గ్రామానికి చెందిన చంద్రకళ పొలం వద్ద పశువులను మేపుకుని సాయంత్రం ఇంటికి వెళుతుండగా, ఈ క్రమంలో చంద్రకళకు మరిదైన వెంకటరమణ తన పొలంలోని పంటను పశువులతో మేపిందని ఆమెపై కర్రతో దాడి చేసి గాయపరిచాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

మొక్కల పెంపకంతో కాలుష్యం నివారణ

గుర్రంకొండ, జూలై 22:మొక్కలను పెంచడం ద్వారా కాలుష్యం నివారించవచ్చని హెచ్‌ఎం నరసింహప్రసాద్ అన్నారు. సోమవారం తరిగొండ జడ్పీ హైస్కూల్‌లో ది ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ఆధ్వర్యంలో మొక్కలను నాటారు. ప్రతి ఒక్కరు మొక్కలను పెంచాలని సూచించారు. అనంతరం విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.22.46 కోట్ల స్త్రీ నిధి రుణాల పంపిణీకి చర్యలు



స్త్రీ నిధి రుణాలపై సూచనలిస్తున్న మేనేజరు అమరావతి

తంబళ్లపల్లె, జూలై 22:ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తంబళ్లపల్లె, పెద్దమండ్యం, ములకలచెరువు, పీటీయం, బి.కొత్తకోట మండలాలకు రూ.22.46 కోట్ల రుణాలు పంపిణీకి ప్రణాళిక సిద్ధం చేసినట్లు స్త్రీ నిధి మేనేజరు అమరావతి పేర్కొన్నారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఏపీఎం గంగాధర్‌తో కలసి డ్వాక్రా మహిళా సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నిధులలో తంబళ్లపల్లె మండలానికి రూ.4.52 కోట్లు, కొత్తకోటకు రూ.3.50 కోట్లు, ములకలచెరువుకు రూ.5.54 కోట్లు, పెద్దమండ్యంకు రూ.3.94 కోట్లు, పెద్దతిప్పసముద్రం మండలానికి రూ.4.96 కోట్లు పంపిణీ చేసేందుకు లక్ష్యంకాగా ఇప్పటికే ములకలచెరువు మండలానికి రూ.2.81 కోట్లు, పెద్దమండ్యం మండలానికి రూ.1.11 కోట్లు, తంబళ్లపల్లె మండలానికి రూ.60లక్షలు రుణాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. అయితే గతంలో తీసుకున్న స్త్రీ నిధి రుణాలు పీటీయం మండలంలో రూ.32.36లక్షలు, తంబళ్లపల్లెలో రూ.11.11లక్షలు, పెద్దమండ్యంలో రూ.1.61లక్షలు, బి.కొత్తకోటలో ఒక లక్ష రుపాయలు బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. మహిళా సభ్యులు గతంలో పొందిన స్త్రీ నిధి రుణాలను సకాలంలో చెల్లిస్తే ఇంకా ఎక్కువ మందికి రుణాలు ఇచ్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు రామలక్ష్మీ, సీసీలు భద్రయ్య, ఆదిలక్ష్మీ, అంశీరాబేగం తదితరులు పాల్గొన్నారు.

కోర్టు వాయిదాకు హాజరైన టీడీపీ నాయకులు

మదనపల్లె టౌన్, జూలై 22: విద్యార్థిని రమ్య హత్య కేసులో దోషులను అరెస్టు చేయాలని టీడీపీ నాయకులు నిర్వహించిన నిరసన ర్యాలీపై అప్పట్లో పోలీసులు బనాయించిన కేసు వాయిదా కోసం మదనపల్లె తెలుగుయువత, టీడీపీ నాయకులు కోర్టుకు హాజరయ్యారు. సోమవారం స్థానిక కోర్టుకు హాజరైన అనంతరం తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు మాట్లాడుతూ 2021 సంవత్సరంలో రమ్య అనే విద్యార్థిని దారుణహత్యకు గురైందని, అప్పట్లో తాము పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసనగా క్యాండిల్ ర్యాలీ నిర్వహించగా టు టౌన్ పోలీసులు తమపై అక్రమ కేసులు పెట్టారని గుర్తు చేశారు. ఈ కేసు విషయమై కోర్టులో వాయిదాకు వచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో నాదెళ్ల అరుణ్‌తేజ, పఠాన్‌ఖాదర్‌ఖాన్, ముద్దుకృష్ణమనాయుడు, విజయమ్మ, అయూబ్, బావాజాన్, శ్రీనాథరెడ్డి, మహబూబ్‌ఖాన్ పాల్గొన్నారు.

ఉద్యోగి గౌతమ్ తేజ్ ప్రమేయంపై విచారణ జరపాలి



కలికిరిలో మాట్లాడుతున్న పాలకుంట శ్రీనివాసులు

కలికిరి, జూలై 22: మదనపల్లె సబ్-కలెక్టర్ కార్యాలయంలో జరిగిన అగ్నిప్రమాదంలో గౌతమ్ తేజ్ అనే ఉద్యోగి ప్రమేయంపై సమగ్ర విచారణ జరపాలని వీసీకే పార్టీ రాష్ట్ర నేత పాలకుంట శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కలికిరిలో సోమవారం ఆయన మదనపల్లె ఘటనపై విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో పుంగనూరు, మదనపల్లె పట్టణాలు, వాటి పరిసర ప్రాంతాల్లో భారీగా భూదందాలు సాగాయన్నారు. ఆ సమయంలో మదనపల్లె సబ్-కలెక్టర్ కార్యాలయంలో పనిచేసే గౌతమ్ తేజ్‌పై అనేక ఆరోపణలు వచ్చాయని, అటువంటి వ్యక్తి ఆదివారం రాత్రి 11 గంటల వరకు కార్యాలయంలో ఉండడం, ఆ తరువాత అగ్నిప్రమాదం సంభవించడంతో ఆయన ప్రమేయంపై అనుమానాలు కలుగుతున్నాయన్నారు. కొత్త సబ్-కలెక్టర్ బాధ్యతలు స్వీకరించాల్సిన రోజు రికార్డులు కాలిపోవడం అంతుచిక్కకుండా ఉందన్నారు. ఈ సంఘటనపై సమగ్ర విచారణ జరపడమే కాకుండా కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో నాయకులు ముల్లంగి కృష్ణయ్య, వంగిమళ్ల గురునాథ, కటారి గంగాధర్, హరినాథ, బంగి ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శిక్ష సప్తాహ్ కార్యక్రమం ప్రారంభం



శిక్షణ సప్తాహ్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

మదనపల్లె అర్బన్, జూలై 22: స్థానిక బాలాజీ కాలనీలోని ప్రాథమికోన్నత పాఠశాలలో శిక్షణ సప్తాహ్ కార్యక్రమం సోమవారం మొదటి రోజు ఘనంగా ప్రారంభించినట్లు విద్యాశాఖాధికారి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. 29వ తేదీ వరకు వారం రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాల్లో కార్యక్రమాలు నిర్వహించేందుకు విద్యాశాఖా కార్యాచరణ రూపొందించిందన్నారు. ఇందులో భాగంగా బాలాజీ కాలనీ పాఠశాల విద్యార్థులచే ఉపాధ్యాయులు దుస్తులు, వ్యర్థప్రదార్థలతో తోలుబొమ్మలతో కూడిన జంతువుల, పక్షులను తయారు చేయించి వాటిచే నాటిక ప్రదర్శన చేయించారన్నారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి రాజగోపాల్, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మధుసూదన, హెచ్‌ఎం జనార్థన, ఉపాధ్యాయులు ఆశ్వర్‌నాయక్, ఆనంద్, రిటైర్డు ఉపాధ్యాయులు విశ్వప్రసాద్, సరోజ, ఆనందనాయుడు, తదితరులు పాల్గొన్నారు.



కస్తూరిభా పాఠశాలలో శిక్షా సప్తాహ్‌లో విద్యార్థులతో పాల్గొన్న ఎంఈవో

పెద్దతిప్పసముద్రంలో : స్థానిక మండల కేంద్రమైన పీటీఎం సమీపంలోని కస్తూరీభా పాఠశాలలో మండల విద్యాశాఖాధికారి నారాయణ, పాఠశాల ఎస్వో శైలజ ఆధ్వర్యంలో శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు సులభతరంగా విద్యాబోధన చేపట్టే కార్యక్రమంలో భాగంగా ఈ నెల 22 నుంచి 29 వరకు పలు కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు విద్యాబోధనను సులభతరం చేసేందుకు స్థానిక వనరులతో తయారు చేసిన బొమ్మల రూపంలో వివరించామన్నారు. 23న పునాది అభ్యసన, సంఖ్యాశాస్త్రం, నైపుణ్యాల అభివృద్ధిపై శిక్షణ 25న పలు సాంస్కృతిక కార్యక్రమాలు, 26న సాంకేతిక నైపుణ్యాలపైఅవగాహన, 27న పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన, 29న విద్యార్థులకు సామాజిక బాధ్యతపై శిక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బందితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.



జడ్పీ బాలికోన్నత పాఠశాలలో శిక్ష సప్తాహ్ కార్యక్రమం

వాల్మీకిపురంలో: నూతన జాతీయ విద్యా విధానం అమలులోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా విద్యాభివృద్ధి సాకారానికి శిక్ష సప్తాహ్ కార్యక్రమం సోమవారం ప్రభుత్వ పాఠశాలల్లో ఘనంగా చేపట్టారు. సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్, అన్నమయ్య జిల్లా డీఈవో ఆదేశాల మేరకు స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులచే ప్లకార్డుల ప్రదర్శన, మానవహారం, అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. అలాగే రేఖాచిత్రాలు, ప్రాజెక్టుల నమూనాలు, విద్యా పరికరాలు, దేశ పటాలు, చార్టుల ప్రదర్శనలు, సాహిత్య ప్రదర్శనలు నిర్వహించి ఉత్తమ ప్రదర్శనలు ఇచ్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈసందర్భంగా హెచ్‌ఎం శ్రీదేవి మాట్లాడుతూ విద్యార్థులలో సృజనాత్మకత పెంపొందించడానికి బోధనా పరికరాలు ఎంతగానో తోడ్పడతాయన్నారు. కార్యక్రమంలో మహిళా ఉపాధ్యాయులు పుష్పలత, అనురాధ, వసుంధర, శోభారాణి, ఉమాదేవి, పర్వీన్‌తాజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన భవనంలోకి చెంబకూరు గ్రామీణ బ్యాంక్



నూతన బ్యాంక్ భవనాన్ని ప్రారంభిస్తున్న బ్యాంక్ చైర్మన్

రామసముద్రం, జూలై22: రామసముద్రం మండలం చెంబకూరులో సోమవారం సప్తగిరి గ్రామీణ బ్యాంకు నూతన భవనంలోకి మార్చారు. ఇంతవరకు ఉన్న బ్యాంకు భవనం భద్రతాలోపం ఉండటంతో భవనాన్ని మార్చినట్లు బ్యాంకు అధికారులు తెలిపారు. ఈ నూతన భవన బ్యాంక్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఉమ్మడి చిత్తూరు జిల్లాల సపగిరి గ్రామీణ బ్యాంకు చైర్మన్ ఏఎస్ఎన్ ప్రసాద్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బ్యాంకును చెంబకూరులో ప్రారంభించి సుమారు 40ఏళ్లు గడుస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో మదనపల్లె డివిజనల్ మేనేజర్ పి.ప్రకాష్, రత్నబబాబు, బ్రాంచ్ మేనేజర్ వినోద్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేయాలి



ఫోల్డర్ ఫైళ్లను పంపిణీ చేస్తున్న ఎంఈవో మనోహర్

పెద్దమండ్యం, జూలై 22: ప్రతి ఒక్కరు విద్యాభివృద్ధికి కృషి చేయాలని పెద్దమండ్యం ఎంఈవో మనోహర్ పేర్కొన్నారు. మండలంలో సిద్దవరం కస్తూర్భా గురుకుల బాలికల పాఠశాలలో రీడో సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి ఈశ్వరయ్య ఆధ్వర్యంలో ఇంటర్ విద్యార్థినులకు ఫోల్డర్ ఫైళ్లను (సర్టిఫికెట్లు భద్రపరిచు)ఎంఈవో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థుల కోసం సేవా దృక్పధంతో తమ వంతు సహాయం చేయడం అభినందనీయమన్నారు. చరిత్ర లో విజయాలు సాధించి పేరు గడించిన, భవిష్యత్ ప్రణాళిక వ్యక్తిత్వ వికాశం కరపత్రం పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ రాణికుమారీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.